

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :20  సంచిక: 6  హైదరాబాద్  డిశెంబరు 2020  పేజీలు 40

Please visit :  www.srimeherbaba.com    వార్షిక సభ్యత్వం : రూ. 100/-

# మెహెరాబాద్‌లో బాబా సమాధి

## ఉదయం 7 నుండి సాయంత్రం 6 వరకూ తెరిచే వుంటుంది



మెహెరాబాద్‌లో బాబా సమాధి ప్రతిరోజూ ఉదయం 7 నుండి సాయంత్రం 6 వరకూ ప్రేమికుల సందర్శనార్థం తెరిచే వుంచుతున్నారు. ఐతే, బాబా సమాధి లోనికి అనుమతించడం లేదు. బాబా ప్రేమికులు అవతారుడిని దూరం నుండి దర్శించుకోవాలని ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం, అలాగే సాయంత్రం వేళలలో సమాధి ఎదుట ప్రార్థనలు, ఆరతి ఇవ్వడం లేదు. ప్రసాదం పంపిణీ లేదు. పూలహారాలు తీసుకురావద్దని బాబా ట్రస్టు కోరుతోంది. కోవిడ్ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ, స్థానిక వాలంటీర్లతో సహకరించవల్సిందిగా శ్రీధర్ కేల్కర్ కోరుతున్నారు. ప్రస్తుత పరిస్తితుల్లో, దూరప్రాంతాల నుండి విచ్చేసే ప్రేమికులకు తగిన వసతి ఏర్పాట్లు చేయడానికి మరికొంత సమయంపడుతుందని స్థానిక ప్రేమికులు తెలిపారు.

# తెలుగునాట గల బాబా కేంద్రాలలో

హైదరాబాద్‌లోని జూబ్లి బాబా కేంద్రం 2021 జనవరి మొదటివారం నుండి కరోనా నిబంధనలను పాటిస్తూ ప్రతి ఆదివారం సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు కార్యదర్శి శ్రీ పి. రాజేంద్ర మెహెర్ తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వున్న పలు బాబా కేంద్రాలలో కూడా స్థానికంగా జరుపుకునే సత్సంగ్ కార్యక్రమాలను త్వరలో ప్రారంభించాలని నిర్వాహకులపై పెద్దఎత్తున ఒత్తిడి వస్తోందని సమాచారం. కాగా, విజయనగరం, పార్వతీపురం తదితర ఉత్తరాంధ్రలోని బాబా కేంద్రాలు **డిశెంబరు రెండవ ఆదివారం నుండి** సత్సంగ్ కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు శ్రీ కొల్లి రామారావు, విజయనగరం తెలిపారు. విశాఖపట్నం, విజయవాడ, తదితర కేంద్రాలు మరికొంత కాలం వేచి చూడాలనే అలోచనలో వున్నట్లు తెలిసింది. ఏదిఏమైనా, కరోనా గడ్డుకాలానికి కామా పెట్టే కాలం అతి త్వరలోనే వుందని భావిద్దాం. తగిన జాగ్రత్తలను పాటిస్తూ మరికొంతకాలం అప్రమత్తంగా వుండాలనుకోవడం ఉభయతారకం!!.

***

## బాబా సందేశం

**Backbiters are your friends, because they share your samskaras.**

**నిన్ను నిరసించేవారు నీ సంస్కారాలలో భాగస్వాములే, కాబట్టి వారు కూడ నీ స్నేహితులే.**

**- మెహెర్‌బాబా**

**గౌరవ సంపాదకులు**
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**
**దశిక ప్రసాదరావు**

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 10వ తేదీ లోపల అందేలా పంపవలసింది.**

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. డాక్టర్ నీలూ | 6-10 |
| 3. ఆధ్యాత్మిక జీవనం | 12-14 |
| 4. 52వ అమరతిథి | 15-16 |
| 5. అమరతిథి విశిష్టత | 17-18 |
| 6. లార్డ్ మెహెర్ | 20-27 |
| 7. మా మాటలు | 28-30 |
| 7. తెలుగు-గుజరాతీ సహవాస్ | 31-34 |
| 8. మంత్రవాది తీసిన ఫోటో | 35-36 |
| 9. మెహెర్‌మౌంట్ | 36-38 |
| 10. పశ్చాత్తాప ప్రార్థన | 39 |

**ముఖచిత్రం**

1956 ఆగస్టు2న మెహెర్‌మౌంట్‌ను మెహెర్‌బాబా సందర్శించారు.

**మనవి**

ఈ ప్రచురణలోని రచనలు, అందలి భావాలు సంబంధిత రచయితలవేనని పాఠకులు గమనించగలరు.

Please visit : www.srimeherbaba.com

# 52వ అమరతిథి

## 2021 జనవరి 30, 31 వర్చ్యువల్ సహవాస్

కోవిడ్ 19 వైరస్ ఇంకా నియంత్రణలోనికి రాని కారణంగా 2021 జనవరి 30, 31 తేదీలలో మెహెరాబాద్ నుండి అవతారుని 52వ అమరతిథి వేడుకలు ఆన్‌లైన్‌లో ఏర్పాటు చేసినట్లు బాబా ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అమరతిథి రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరువారు తమ వివరాలను ట్రస్టువారికి అందేలా 2020 డిశెంబరు 10 లోగా అందేలాగా పంపవలెనన్నారు. మరిన్ని వివరాలకు అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు వెబ్‌సైట్‌ను దర్శించగలరు. లేదా, **amartithihelpdesk@gmail.com** / 74477-66580 / 74477-66585, సంప్రదించవల్సింది. ముఖ్యంగా, **2021 జనవరి 31న మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ** బాబా ప్రేమికులందరూ వారి వీలునిబట్టి, ఆ సమయంలో వారెక్కడున్నా అవతారుని నామస్మరణతో మౌనం పాటించవల్సిందిగా మనవి చేశారు. **"ప్రియతమ మెహెర్‌బాబా ఎప్పుడూ మీతో వుంటాడని, ఆయన నుండి మీరు ఎన్నడూ వేరు కాదని ప్రవచించిన అవతారుని మాటలను", ట్రస్టు చైర్మన్ మరోమారు బాబా ప్రేమికులకు గుర్తుచేశారు.**

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామం ఎక్కువమంది పాఠకులకు అందజేసేందుకు వీలుగా మీ బంధు మిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రికకు వార్షిక, జీవిత సభ్యులుగా చేర్పించండి. మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలను ప్రతి సంచికలోని పేజి 40 లోగా సవివరంగా తెలియజేయడమైంది లేదా మొబైల్ 99595-53218 సంప్రదించగలరు. మెహెర్‌బాబా పత్రికను ప్రతినెలా ఠంచనుగా 26వ తేదీన పోస్ట్ చేస్తున్నాం. అంతకంటే ముందుగా అంటే ప్రతినెలా 20వ తేదీ కల్లా పత్రికను సిద్ధం చేసి ప్రింటింగ్ కోసం పంపుతూ, మెహెర్‌బాబా పత్రిక పేరిట ప్రారంభించిన వాట్సప్ గ్రూప్‌లో, అలాగే ఇ-మెయిల్ ద్వారా పోస్ట్ చేస్తున్నాం. ప్రింటింగ్ పూర్తయ్యాక సభ్యులందరికి ప్రతినెలా 26 తేదీన పోస్టు చేస్తున్నాం. పత్రిక మీ ఇంటికి 28వ తేదీలోగా తప్పక బట్వాడా అవుతుంది. మీ అడ్రస్సులో మార్పులుంటే తక్షణం మొబైల్ ఫోన్ నంబరు 99595 53218 యస్‌యంయస్ లేదా వాట్సప్ ద్వారా గానీ తెలియజేయవల్సింది.

సంపాదకీయం

# గుర్తుంచుకుందాం

## 2021 జనవరి 31 మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ

జనవరి, ఫిబ్రవరి నెలలు బాబా ప్రేమికులకు చాలా ప్రత్యేకం.
మార్చి నుండి అక్టోబరు దాకా కేంద్ర వార్షికోత్సవాలు,
సహవాస్‌లతో వారు బిజీగా వుంటారు.
ఇకపోతే జనవరిలో బాబా దగ్గరకు వెళ్ళడానికి నవంబరు నుండి
ప్రయాణ సన్నాహాల్లో తలమునకలవుతారు.
ఈ మాదిరిగా వున్న వారి జీవన గమనంలో అకస్మాత్తుగా బ్రేక్ పడింది.
కోవిడ్ వైరస్ ప్రేమికుల ప్రణాళికలలో పెద్ద మార్పు తీసుకొచ్చింది.
1940-50ల నడుమ ఈ విపత్కర పరిస్థితులపై బాబా చాలా వివరంగా చెప్పారు.
ఈ పరిస్థితులను మానవాళి ఎలా ఎదుర్కొంటుందని
ఒక సందర్భంలో బాబా కళ్ళు చెమ్మగిల్లాయని ఆనాటి రచనలు తెలియజేస్తున్నాయి.
నేడు మహారాష్ట్రలో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా వుంది.
బాబా ప్రేమికులు జూలై 10న మౌనవార్షికోత్సవానికి వెళ్ళలేక పోయారు.
జనవరిలో అమరతిథికి కూడా వెళ్ళలేకపోతున్నామన్న వారి
బాధను మాటల్లో చెప్పలేం. ఇదంతా అవతారుని దివ్య ప్రణాళికలోని భాగమే!!
బాబా సశరీరులుగా మనల్ని కలవటం మానేసిన రోజుని అమరతిథి గుర్తుచేస్తుంది.
**ప్రియతమ మెహెర్‌బాబా ఎప్పుడూ తన ప్రేమికులతోనే వుంటానన్నారు.**
**పిలిస్తే పలికే దైవం మెహెర్‌బాబా. మీ శ్వాసకన్నా దగ్గరగా తానుంటానన్నారు.**
**తన నామస్మరణ మరువవద్దని మెహెర్‌బాబా పలుమార్లు హెచ్చరించారు.**

***

అమరతిథి రోజున మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ
బాబా ప్రేమికులందరూ మెహెర్‌బాబాను స్మరిస్తూ మౌనం పాటిస్తారు.
జనవరి 31న బాబా ప్రేమికులు వారి వీలునిబట్టి, ఆ సమయంలో
వారెక్కడున్నా అవతారుని నామస్మరణతో మౌనం పాటించి
అవతారుని దివ్యాశీశ్శులు పొందగలరు.
ఇదొక అరుదైన మహత్తర అవకాశమని గుర్తుంచుకుందాం!!

***

# డాక్టర్ నీలకంఠ యన్ గోడ్‌సే



డాక్టర్ నీలూగా బాబా ప్రేమికులందరికీ ఈయన బాగా సుపరిచితుడు. మహారాష్ట్రలోని పూణే నగర నివాసి. చిన్నతనం నుండి ఆధ్యాత్మిక వాతావరణంలో పెరిగిన స్త్రోత్రీయ బ్రాహ్మణుడు. ఏడు సంవత్సరాల పిన్న వయస్సులోనే స్థానిక దేవాలయాల్లో జరిగే భజనల్లో పాల్గొని కీర్తనలు పాడేవాడు. బాబా మండలి సభ్యుడైన విష్ణు మాస్టర్ ఈయనకు చిన్ననాటి స్నేహితుడు. వీరిద్దరూ పూణేలోని న్యూ ఇంగ్లీషు హైస్కూల్లో చదువుకున్నారు. మెట్రిక్యులేషన్ చదువుతుండగానే విష్ణు మాస్టర్ చదువులకు స్వస్తి చెప్పి మెహెరాబాద్‌లో అవతారుని ఆశ్రమంలో చేరాడు. ఐతే నీలూ మాత్రం తన చదువులు కొనసాగించి, గ్రాంట్ మెడికల్ కాలేజి, ముంబాయి నుండి యం.బి.బి.యస్.పూర్తిచేశాడు. 1927లో ఒకరోజున మెహెర్‌బాబా దర్శనం చేసుకోవడానికై తన చిన్ననాటి స్నేహితుడైన నీలూని మెహెరాబాద్‌కు రమ్మనమని విష్ణు మాస్టర్ ఆహ్వానించాడు. డాక్టర్ నీలూకి ఆధ్యాత్మిక చింతనపట్ల ఎంత ఆసక్తి వున్నా, బాబాలంటే సదభిప్రాయం లేదు. మెహెర్‌బాబా గురించి అంతక్రితమే తెలిసినా, ఆయన్ని దర్శించుకోవాలని ఎన్నడూ అనుకోలేదు. ఐనప్పటికీ తన స్నేహితుని కోసం మెహెరాబాద్ వెళ్ళాడు. అవతారుని దర్శనంతో డాక్టర్ నీలూలో ఏదో తెలియని మార్పు వచ్చింది. బాబా నీలూని చూస్తూనే ముందుగా నీ స్నేహితునితో తనివితీరా మాట్లాడుకుని రమ్మనమని బాబా విష్ణుని తన దగ్గరకి పిలిపించారు. తన మనస్సులోని ఆలోచన బాబాకు ఎలా అర్థమయ్యిందనుకుంటూ నీలూ ఒకింత ఆశ్చర్యపడ్డాడు. వాస్తవానికి నేను విష్ణు కోసమే ఇక్కడకు వచ్చాను. ఐతే ఇప్పుడు నా మనస్సు మార్చుకున్నాను. విష్ణు మాదిరిగా నాక్కూడా మిమ్మల్ని అనుసరించాలని వుందని క్లుప్తంగా బాబాతో అన్నాడు. బాబా సంతోషించారు. “నీ తీరిక సమయాల్లో నా గురించి ఆలోచించమని సలహా ఇచ్చారు బాబా. నీ స్నేహితునిగానో లేదా మీ అన్నగారిలాగానో ఆలోచించవచ్చన్నారు.” బాబావారి ఈ మాటలు నీలూని మరింత

ఆలోచింపజేశాయి. మెహెరాబాద్ ఆశ్రమంలో బాబా మండలి గడుపుతున్న అత్యంత నిరాడంబర జీవితం తనని ఎంతగానో ఆకర్షించిందని, నీలూ బాబాకు చెప్పాడు. ముంబాయికి తిరిగి వెళ్ళాక కూడా బాబావారి మాటలు ఆతని చెవుల్లో వినపడుతూనే వున్నాయి. మెహెరాబాద్‌కు తిరిగి వెళ్ళాలని, బాబాను మరలా దర్శించుకోవాలన్న కోరిక రోజురోజుకీ ఎక్కువయ్యింది. మెహెరాబాద్ విశేషాలను పూసగుచ్చినట్లు ఎప్పటికప్పుడు విష్ణు మాస్టర్ తెలియజేస్తుండేవాడు. మెడిసిన్‌లో చదువు పూర్తికాగానే మెహెరాబాద్‌లో ఆశ్రమవాసిగా వచ్చి స్థిరపడ్డాడు. అవతారుని వ్యక్తిగత వైద్యునిగా బాబా ప్రేమికులకు, స్థానికులెందరికో విశేష సేవలందించాడు డాక్టర్ నీలూ. 1936లో బాబావారి ఆదేశాల మేరకు రాహూరీలో, ఆ పిదప మెహెరాబాద్‌లో **మెహెర్ ఉచిత డిస్పెన్సరీ నెలకొల్పి** ఎందరికో వైద్యసేవలు అందించాడు డాక్టర్ నీలూ. **అవతారుని సమక్షంలో డాక్టర్ నీలూ అనుభవించిన ఆనంద గుళికలు ఎన్నో, ఎన్నెన్నో!! అవేవో ఇకపై తెలుసుకుందాం!! గమనించండి!! !!!**

## అంబేద్కర్‌తో సమావేశం

1932లో ముంబాయిలో యంబిబియస్ చదువుతూ, బాబాను తరచు దర్శించు కునేవాడు. అప్పట్లో బాబా నాసిక్‌లో వున్నారు. బాబా హరిజనుల సమస్యపై అంబేద్కర్‌తో చర్చించాలనుకున్నారు. ఆ సందర్భంగా నీలూ అంబేద్కర్‌ని ముంబాయిలో కలిసి, బాబావారి గురించి చెప్పగానే అందుకు ఆయన తక్షణం ఒప్పుకున్నాడు. ఆ మాదిరిగా 1932 సెప్టెంబరు 13న అంబేద్కర్‌ని బాబా కలిశారు. ఆ సమావేశం షెడ్యూల్డు కులాల వారి జీవితాల్లో అనూహ్యమైన మార్పుకు కారణమయ్యిందన్న సంగతి పాఠకులకు తెలుసు.

## పంజిమ్‌లో ఐస్‌క్రీం

1940 ప్రాంతంలో బాబా మండలి బృందం బ్లూ బస్ యాత్రలో భాగంగా గోవాలోని పంజిమ్‌కు చేరుకున్నారు. అమెరికన్ బాబా ప్రేమికురాలు ఎలిజెబెత్ పాటర్‌సన్ దగ్గరలో మంచి క్వాలిటీ ఐస్ క్రీం లభిస్తోంది. అందరి కోసం ఐస్‌క్రీం తీసుకురావడానికి ఆమె బాబా అనుమతి కోరింది. బాబా మంచిదన్నారు. ఐతే, దానివల్ల జలుబు, దగ్గు సోకరాదన్నారు బాబా. అదే సమయంలో బాబా డాక్టర్ నీలూని పిలిచి, ఐస్‌క్రీం తినడం వల్ల గొంతునొప్పి, జలుబు చేస్తే ఏం చేయాలని సలహా అడిగారు. ఇలాంటి వ్యాధులన్నింటికీ వెల్లుల్లి చట్నీ దివ్యౌషధం అని జవాబిచ్చాడు డాక్టర్ నీలూ. దాంతో బాబా ఎలిజెబెత్‌ని ఐస్‌క్రీం తీసుకురమ్మనమన్నారు. ఆమె చాలా సంతోషించింది. ఐతే, డాక్టర్ నీలూ బాబాకిచ్చిన సలహా గురించి ఆమెకు తెలియదు. బాబా – నీలూల సంభాషణ కూడా మరాఠీలో జరిగింది. డాక్టర్ నీలూకు కూడా ఐస్‌క్రీం తీసుకొస్తున్న

సంగతి తెలియదు. ఎలిజెబెత్ ఐస్‌క్రీం కోసం అలా వెళ్ళగానే స్త్రీ మండలిలోని కేటి, మనూలను పిలిచి అందరికీ సరిపడా వెల్లుల్లి చట్నీని సిద్ధం చేయమన్నారు బాబా. ఐస్‌క్రీం వచ్చాక బాబా అందరికీ పంచిపెట్టారు, అందర్నీ తిన్నంత ఐస్‌క్రీం తినమన్నారు. అలాగే, ఐస్‌క్రీం తినడం పూర్తయ్యాక ఓ పెద్ద చెంచాడు వెల్లుల్లి చట్నీ కూడా తినమని మండలివారినందరినీ బాబా ఆదేశించారు. దాంతో మండలి ఖంగుతింది. ఐస్‌క్రీం ఇవ్వకపోయినా బాగుండేది కదా అనుకున్నారు.

## బాసుంది స్వీట్లు...

డాక్టర్ నీలూకి స్వీట్లు అంటే వల్లమాలిన ఇష్టం. అందులోనూ బాసుంది అంటే ఆతనికి మరింత ఇష్టం. బాసుంది పేరు వింటేనే ఆతడి నోట్లో నీళ్ళూరుతాయంటాడు డాక్టర్ నీలూ. ఐతే ఒకసారి ఏమయ్యిందంటే....మండలి సభ్యురాలైన పిలమాయిని పిలిచి ఒక డబ్బా నిండా ఆవు పేడ వేసి, గిఫ్ట్ ప్యాకెట్ మాదిరిగా చక్కగా ప్యాక్ చేసి తీసుకురమ్మనమన్నారు బాబా. ఆమె అలాగేనని ఆవుపేడతో గిఫ్ట్‌ప్యాక్ తీసుకువచ్చింది. బాసుంది స్వీట్లు డబ్బాని చూసి డాక్టర్ నీలూ చాలా సంతోషించాడు. బాబా ఆ డబ్బాని నీలూకి ఇస్తూ, ఇందులోని సగం స్వీట్లు నీవు తిను, మిగిలినవాటిని మండలి వారందరికీ పంచమన్నారు. నీలూ సంతోషించాడు. ఆనందంగా డబ్బా మూత తెరచి చూసి అవాక్కయ్యాడు. ముఖం పాలిపోయింది. ఆనందం ఆవిరయ్యింది. ఆ పిదప బాబా నీలూతో ఇలా అన్నారు. **"నీవు చూస్తున్న ప్రపంచం ఈ ఆవు పేడలాంటిదన్నారు బాబా. ఈ మర్మం నీవు తెలుసుకుంటే, నీవు ఏర్పరుచుకున్న బంధాలు, బంధనాలు అన్నింటినీ త్వరలోనే వదులుకుంటావ్!!. ఈ సూక్ష్మాన్ని నీవు గ్రహిస్తే, ఆవుపేడ వున్న డబ్బాను విసిరేసినట్లు, ఏదోఒకరోజున ఈ ప్రాపంచిక విషయాలన్నింటినీ నీవు త్యజించగల్గుతావని" బాబా ఆతనికి హితవు చెప్పారు.**

## నీలూ అవివాహితుడు

డాక్టర్ నీలూ మెహెరాబాద్‌కి వచ్చిన కొత్తల్లో ఆతడికి అనేక పెళ్ళి ప్రయత్నాలు చేశారు. బాబా కూడా పెళ్ళి చూపుల కోసం వెళ్ళడానికి అభ్యంతరం చెప్పలేదు. పెళ్ళి చూపుల కోసం నీలూ చాలాసార్లు పూణేకు వెళ్ళాడు. బాబా తల్లి షిరిన్‌మాయి మరికొందరు కొంతమంది అమ్మాయిల్ని నీలూకు చూపించారు. ఆశ్చర్యం ఏమంటే, నీలూకి అమ్మాయి నచ్చితే, ఆమెకు నీలూ నచ్చలేదు. అలాగే, చాలామంది అమ్మాయిలు కూడా నీలూతో పెళ్ళికి ఒప్పుకోలేదు. ఏతావాతా, నీలూ విసిగిపోయాడు ఓ రోజున నీలూ ఒక స్థిర నిశ్చయానికి వచ్చి, "నేను పెళ్ళి చేసుకోను". అవివాహితుడిగానే వుండిపోతానని బాబా ఎదుట ఘంటాపథంగా చెప్పాడు. నిజమేనా!! మళ్ళీ మాటమారుతుందా? అని బాబా అడిగితే, ఈ విషయమై నన్నెవరూ

శాసించలేరన్నాడు. నీలూ గురించి బాబా ఒక సందర్భంలో ప్రస్తావిస్తూ, **నీలూ పెళ్ళి చేసుకోరాదన్నది నా అభిప్రాయం కూడా. అది నా ఇచ్ఛ.** కానీ నేను ఆ మాట ముందుగానే ఆతనికి చెబితే, నీలూ నా ఆదేశాన్ని విధేయతతో అంగీకరించినా, ఆ పిదప పెళ్ళి చేసుకోవాలన్న ఆతడి మనస్సులోని కోరిక ఆతడ్ని దహించివేస్తుంది. అందుకే " నా తాళం చెవిని సరైన సమయంలో తిప్పానని", అన్నీ ఎరిగిన అవతారుడు నవ్వుతూ అన్నారు. మెహెరాబాద్ ఆశ్రమంలో తొలినాళ్ళ నుండి (1927) అనుక్షణం బాబా సమక్షంలో నిరాడంబరమైన జీవనం గడిపిన డాక్టర్ నీలూ గురించి ఇలా చెప్పుకుంటూపోతే ఒక పెద్ద గ్రంథమే అవుతుంది.

## నవజీవనంలో

నవజీవన కార్యక్రమంలో అవతారునితో పాల్గొన్న డాక్టర్ నీలూ, 1949 అక్టోబరు 20న పూణే నుండి బయలుదేరి ఉదయం 8 గంటలకు ఒక ప్రైవేటు బస్సులో సతారా చేరుకున్నారు.అంతక్రితం నాలుగురోజుల క్రిందటనే అక్టోబరు 16న నవజీవన కార్యక్రమం ప్రారంభమైంది. ఇంకా ఎన్నాళ్ళీ ఈ జీవనం. మెహెరాబాద్‌కు ఎప్పుడు వెళ్తాం అని, ఆదీ కె ఇరానీతో నీలూ అనడం విన్న బాబా, నీలూని గట్టిగా చీవాట్లు పెట్టారు. ఇలాంటి ఆలోచనలు రావడం నవజీవన విధానానికి వ్యతిరేకం అన్నారు. 1950 జనవరి 1 తర్వాత ఇలాంటి మాటలు వినపడితే ఎవరి పెట్టాబేడా వారు సర్దుకోవాల్సిందేనని బాబా హెచ్చరించారు. నవజీవనం గడుపుతున్న సమయంలోనే 1950 ఏప్రిల్, వేసవికాలంలో బాబా హెమరాయిడ్స్‌తో ఓ వారం రోజులు విపరీతంగా బాధపడ్డారు. డాక్టర్ నీలూ, గోహెర్‌లు బాబాకు శ్రద్ధగా చికిత్స చేశారు. డాక్టర్ కటారియా అనే ప్రముఖ వైద్యుని సహాయం కూడా వీరు తీసుకున్నారు. వారం రోజుల తర్వాత బాబాకు స్వస్థత చేకూరింది. ఆ రోజుల్లో బాబా డెహ్రాడూన్‌కి సమీపంలోని మంజ్రీమాఫీలో వున్నారు. ఓ రోజున నీలూ మంజ్రీమాఫీకి తిరిగి వస్తుంటే, ఒక తల్లి కొడుకు ఇద్దరూ బాబాకు కృతజ్ఞతలు తెలియజేయాలని మంజ్రీమాఫీ బైట వేచి వున్నారు. బాబా దయవల్ల తమ బిడ్డ ఆరోగ్యం పూర్తిగా కుదుటపడిందని చెమ్మగిల్లిన కళ్ళతో, వారిద్దరూ రెండు చేతులూ జోడించారు. బాబా హెమరాయిడ్స్‌తో బాధపడింది ఈ పిల్లవాని కోసమే? అని నీలూకు అర్థమయ్యిందన్నాడు.

## నీలకంఠ్

నవజీవనంలో వేళకు భోజనం ఉండేది కాదు. పోషకాహారం మాట అటుంచి, సరైన తిండి దొరికేది కాదు. ఎన్నోసార్లు ఉపవాసాలున్నారు.త్రాగడానికి సరిపడినంత నీళ్ళు కూడా వుండేవి కావు. వీటికితోడు పనిఒత్తిడి, అలసట భౌతిక, మానసిక

ఆందోళనలు, విపరీతమైన చలి, ఎండ, వానలను తట్టుకునేందుకు సరిపడ దుస్తులు లేకపోవడం ఇత్యాదులతో బాబాకు, ఆయన మండలివారందరి ఆరోగ్యం క్రమేణా క్షీణించిందని నీలూ తన నవజీవన అనుభవాలలో ప్రత్యేకంగా ప్రస్తావించాడు.

బాబా నీలూని ఉద్దేశించి ఇలా అన్నారు. నేను రేపటి నుండి నిన్ను పర్షియా దేశపు రాజుని చేస్తానంటే, ఆ మాటలో ఏమాత్రం అనుమానం లేదన్నారు. అలాగే, తిరిగి ఆ మర్నాడు నిన్ను ఆఫ్రికాలో స్వీపర్‌ని చేస్తానంటే, దాన్ని కూడా నీవు ఆనందంగా అంగీకరించు. ఆ మర్నాడు అన్నీ వదిలిపెట్టి, వీధుల్లో బిక్షం ఎత్తుకోమంటే కూడా ఆనందంతో దాన్ని కూడా సంతోషంగా అంగీకరించు అన్నారు బాబా. **అప్పుడు నీలూ..“నీలకంఠ్”** అవుతాడన్నారు బాబా. సద్గురువుచేత ఎంపిక చేయబడినవారు ఎందుకు? ఏమిటి? అనే వాదనలు ఆయనతో చేయరని బాబా అన్నారు. .

## చమత్కారం

ఒక్కోసారి బాబా కావాలనే తన మండలివారి మధ్య తగాదాలు లాంటి ముచ్చట తెచ్చేవారు. ఇది బైటకు తగాదాలు పెట్టినట్లు కనిపించినా, అంతర్గతంగా దాగివున్న సమస్యలు పరిష్కారమయ్యేవి. ఆ కోవలోనిదే ఈ సంభాషణ కూడా!!.

ఒక రోజున మండలి సభ్యుడైన బైదుల్‌కి బాబా కనుసైగ చేసి, “నీవు నీలూ గురించి నిన్న ఏదో చెబుతున్నావ్?” అన్నారు. నీలూ కాలేజీలో చదువుతున్నప్పుడు ఎవరో కాలి బూట్‌తో కొట్టారన్నావ్? ఎవరది? అని బాబా ప్రశ్నించారు. బైదుల్‌కి విషయం అర్థమయ్యింది. ఆపై రెచ్చిపోయాడు. నీలూ కాలేజీలో ఒక అందమైన అమ్మాయిని ప్రేమించాడు. ఆ విషయం వాళ్ళ నాన్నకు తెలిసి, నీలూని నడిబజారులో తనకాలి బూటుతో చడా మడా కొట్టాడు. ఈ మాటలు నీలూకి తీవ్ర కోపం తెప్పించింది. బాబా నీవెందుకు ఇలాంటి చదువురానివాడి మాటలు నమ్ముతావ్? నేను కాలేజిలో వున్నప్పుడు ఈతను ఎక్కడున్నాడు? అని ప్రశ్నించాడు నీలూ. నేనూ నీతోనే వున్నాను అన్నాడు బైదుల్. ఇలా మరో అబద్ధం చెప్పావంటే నా బూట్లతో కొడతానని బైదుల్‌ని బెదిరించాడు నీలూ. ఇద్దరినీ నెమ్మదిగా వుండమని హెచ్చరిస్తూ అసలు సంగతి ఏమిటని నీలూని బాబా అడిగారు. బైదుల్ నా విషయంలో ఎందుకు తలదూరుస్తాడు? నేను అబద్ధం చెప్పినట్లయితే, నీలూ నీవే నిజం చెప్పొచ్చుగా? అన్నాడు బైదుల్. నీవెవరు నాకు చెప్పడానికన్నాడు నీలూ. నీవెవరూ ఆ విషయాన్ని దాచిపెట్టడానికి అన్నాడు బైదుల్. ఈ వెధవని ఇక్కడ్నుంచి పంపించేయి బాబా లేదంటే నేను చేయిచేసుకోవల్సివస్తుందన్నాడు నీలూ. బైదుల్ నీకంటే బలమైనవాడు. జాగ్రత్త అని నీలూని బాబా హెచ్చరించారు. అతనెందుకు నా గురించి అబద్దాలు చెబుతున్నాడని తిరిగి నీలూ అన్నాడు. అతనేదో విన్నాడు. నాకూ ఈ విషయంపై అనుమానం వుంది అన్నారు బాబా. నేను రుజువు చేయగలను. నేను చెప్పేదంతా నిజం అని బైదుల్

అన్నాడు. ఓహో!! అలాగా? నీలూ వెనుక ఒక అమ్మాయి వుందంటావా? అన్నారు బాబా ఆశ్చర్యంగా. నేను ఆ అమ్మాయి వెనుక పడలేదు. ఆమెను కనీసం తాకలేదు. ఆమె నన్ను బాగా ప్రేమించింది. నావల్లనే ఆమె భగ్నప్రేమికురాలిగా నేటికీ పెళ్ళి చేసుకోలేదు అని నీలూ బాబాతో చెప్పాడు. నీవు ఈ విషయం నాకు ముందుగా ఎందుకు చెప్పలేదు. ఇన్నేళ్ళుగా నా దగ్గర దాచిపెట్టావ్? బైదుల్ చెప్పాడు కాబట్టి నాకు తెలిసింది. లేదంటే నాకు ఎన్నటికీ తెలిసేది కాదు కదా!! అన్నారు బాబా. ఆమెతో నాకు ఏ సంబంధం వుందని నీకు చెప్పాలి బాబా అన్నాడు నీలూ. ఆమె ఇంకా పెళ్ళి చేసుకోకుండా నిన్ను ప్రేమిస్తోంది కదా? అవునా? కాదా? అన్నారు బాబా. కాబట్టి ఆమెకు సంబంధించిన సంస్కారాలు నీ వెంటవున్నాయి.
ఆ సంస్కారాలతో నీవు నాతో వుంటున్నావ్. కాబట్టి ఆ సంస్కారాలను కూడా నేను భరించాల్సివస్తోంది. నీవు కనుక ముందుగా చెప్పినట్లయితే, ఆ సంస్కారాల భారం నాకుండేది కాదన్నారు బాబా. ఫరవాలేదు. ఇక దాని గురించి బాధపడొద్దు అని అభయమిచ్చారు బాబా. బైదుల్‌కి నీలూ ప్రేమాయణం గురించి ఏమీ తెలియదు. బైదుల్ – నీలూల నడుమ తగాదా రాజేసింది బాబానే. నీలూ ప్రేమ ప్రస్తావన బైటకు తెచ్చి, ఆతనిలో నిగూఢంగా దాగివున్న సంస్కారాల భారాన్ని బాబా తొలగించారు. ఇదే అవతారుని చమత్కారానికి నిదర్శనం.

## సతారాలో కారు ఆక్సిడెంట్

1956 డిశెంబరు 2న సతారాకు సమీపంలో ఉద్తారా గ్రామం దగ్గర బాబా ప్రయాణిస్తున్న కారు ఘోర ప్రమాదానికి గురైందన్న సంగతి పాఠకులకు తెలుసు. ఈ ప్రమాదంలో బాబాతో ప్రయాణిస్తున్న డాక్టర్ నీలూ అక్కడికక్కడే తుదిశ్వాస విడిచాడు. "తన మరణం సునాయాసంగా బాబా సమక్షంలో జరగాలని బాబాను తరుచు కోరుకునేవాడు డాక్టర్ నీలు. బాబా మండలితో కడూ తరచు ఈ మాటనే చెప్పేవాడు. ఆ మాదిరిగా డాక్టర్ నీలూ కోరికను అవతారుడు ఆలకించాడు. అంతక్రితం వారం డాక్టర్ నీలూని బాబా ప్రేమగా తన దగ్గరకు తీసుకున్నారు. ఆతనికిష్టమైన స్వీట్లు తెప్పించారు. అలా బాబా ఎందుకు చేశారో మండలివారికిప్పుడు అర్థమైంది. డాక్టర్ నీలూ తన సమక్షంలో తుదిశ్వాస విడవడం ఆతను చేసుకున్న అదృష్టం అన్నారు బాబా. డాక్టర్ నీలూ నా ప్రేమికులలోకెల్లా ముఖ్యుడన్నారు. నా విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమంలో డాక్టర్ నీలూ తనదైన ప్రత్యేక సహాయం అందించాడన్నారు బాబా. అవతారుని అభినందనలు అందుకున్న డాక్టర్ నీలూ ధన్యుడు. బాబా ప్రేమికులకు మార్గదర్శకుడు.

***

# అవతారునితో ఆధ్యాత్మిక జీవనం

**(శ్రీ నోరి హనుమంతరావు, హైదరాబాద్)**

**ఇది బాబావారి సందేశం.**

ఆ సమయంలో బాబా సతారాలో వున్నారు. అలోబా కిచెన్ ఇంచార్జ్‌గా వున్నాడు.
వంటగదిలో జరిగే పనులను పర్యవేక్షిస్తున్నాడాయన.
కుషాల్, కిర్‌పాల్ అనే ఇద్దరు నేపాలి కుర్రాళ్ళు ఆయన దగ్గర పనిచేస్తున్నారు.
ఇటీవలనే వారిద్దరూ డెహ్రాడూన్ నుండి వచ్చారు. అలోబా చెప్పే పనులు వీళిద్దరూ
చేస్తున్నారు. ఒకరోజున ఈ కుర్రాళ్ళు ఉదయాన్నే చెప్పిన టైంకి నిద్రలేవ లేదు.
దాంతో అలోబాకు కోపం వచ్చింది. గట్టిగా మందలించాడు వాళ్ళని.
ఈ విషయం బాబాకి తెలిసి, ఆ కుర్రాళ్ళని అంత గట్టిగా కోప్పడవద్దని అలోబాను
హెచ్చరించారు. ఆ పిదప, అలోబా, భావూలతో కలిసి బాబా తన బంగళావైపు నడిచి
వెళ్తూ, భావూని ఉద్దేశించి ఏం అలోచిస్తున్నావ్? అని అడిగారు.
ఆ కుర్రాళ్ళపై అలోబా గట్టిగా విరుచుకుపడటం గురించి ఆలోచిస్తున్నానని,
తన మనస్సులోని మాటను ఉన్నది ఉన్నట్లు చెప్పాడు భావూ!!
దాంతో బాబాకు కోపం వచ్చింది. భావూని చెడామడా తిట్టేశారు.
నీవు ఇక్కడ్నుంచి తక్షణం వెళ్ళిపో!! అన్నారు.
భారతదేశంలో ఎన్నో ఆశ్రమాలున్నాయి. ఏదో ఒకటి వెతుక్కో.
ఆ ఆశ్రమాలలో నీవు కోరికునే నీతివంతమైన జీవనాన్ని గడపగల్గుతావన్నారు.
బాబాకు అంతగా కోపం ఎందుకొచ్చిందో తెలియక భావూ నోట మాట రాలేదు.
బాబా ఇంకా ఇలా అన్నారు. ఈ సమాజం వల్లెవేసే నీతివంతమైన జీవితాన్ని
నా దగ్గర గడపలేరన్నారు. ఇక్కడ నీతి వాక్యాలకంటే,
ఆధ్యాత్మికతకు ప్రాధాన్యం ఇస్తామన్నారు.
ఆధ్యాత్మిక జీవనానికి ఈ నీతి సూత్రాలు అక్కరకు రావన్నారు.
వ్యక్తిగతంగా ఎవరి సంస్కారాలు వారివి.
ఒక్కొక్కరి సంస్కారాలు ఒక్కోరీతిలో వుంటాయి.
ఒక వ్యక్తి నడవడి, ఆతని ప్రవర్తన, ఆతడి మాట్లాడేతీరు అన్నీ వారి వారి
సంస్కారాలపైనే ఆధారపడి వుంటాయి.
సాధారణ జీవనంలో ఒక వ్యక్తి బైటకు మంచిగా కనిపించవచ్చు.
కానీ ఏవో కొన్ని చెడు లక్షణాలు ఆతనిలోనే దాగివుంటాయి.

ఆ చెడు సంస్కారాలు ఆతడ్ని వదలి ఎక్కడకీ పోవు.
ఆతడ్ని అంటిపెట్టుకునే వుంటాయి.
కాలచక్ర గమనంలో ఆతను ఆ చెడ్డ సంస్కారాలను ఖర్చు చేయాల్సిందే!!
ఈ జన్మలో కాకపోతే, మరికొన్ని జన్మలు ఎత్తైనా సరే ఆ సంస్కారాలను
ఖర్చు చేయాల్సిందేనన్నారు బాబా.

## ఆధ్యాత్మిక జీవనం

ఆధ్యాత్మిక జీవనంలో అలాకాదు.
మంచి-చెడు సంస్కారాలు రెండూ ఏకకాలంలో బైటకు వ్యక్తమౌతాయి.
ఆ రెండు సంస్కారాలు ఏకకాలంలో ఖర్చుచేయబడతాయి.
సంస్కారాల శేషం ఏమాత్రం మిగలవు.
ఆధ్యాత్మిక జీవనం సహజత్వం వైపు నడిపిస్తుంది.
వినయం, విధేయతలతో మంచి నడవడికతో
జీవనం గడుపుతున్నామనుకునేవారిలో అహాన్ని పెంచుతుంది.
క్రమేణా, అది శాశ్వతంగా నిలుస్తుంది కూడా.
ఆధ్యాత్మిక జీవితం అవతారుడు లేదా సద్గురువు కనుసన్నలలోనే నడుస్తుంది.
ప్రతిఒక్కరి గురించి అవతారుడికి క్షుణ్ణంగా తెలుసు.
అవతారుడికి ప్రతిఒక్కరి జీవితం తెరిచిన పుస్తకం.
ఎవర్ని ఎలా చూడాలో అవతారుడికి తెలుసు.
వారి వారి సంస్కారాలను బట్టి అవతారుడు వారికి తగిన విధంగా ఆదేశిస్తాడు.
మార్గదర్శకం చేస్తాడని బాబా అన్నారు. నీకు అలోబా ప్రవర్తన నచ్చకపోవచ్చు.
కానీ, ఆతని సంస్కారాల నిర్మూలనకు ఆతని ప్రవర్తన సరైనదే.
అది నీకెలా అర్థమౌతుంది. సమాజంలో ప్రతిఒక్కరూ నైతిక ప్రమాణాలు పాటిస్తూ
అందరికీ ఆమోదయోగ్యమైనట్లు ప్రవర్తిస్తారు.
ఐతే, అవతారుడు లేదా సద్గురువు ఆయా వ్యక్తుల సంస్కారాలను అనుసరించి
వారితో వ్యవహరిస్తారని బాబా అన్నారు.
అందువల్ల ఆధ్యాత్మిక జీవనం పూర్తిగా భిన్నమైనది.
నైతికత, నీతి నియమాలు మరి ఇతర అంశాల ఆధారంగా
ఆధ్యాత్మిక జీవికపై తీర్పు ఇవ్వరాదన్నారు.
ఇప్పుడు చెప్పు, నీవు ఏ ఆశ్రమానికి వెళ్ళాలనుకుంటున్నావ్ అని
భావూని బాబా అడిగారు.
నేనెక్కడికీ వెళ్ళనని కచ్చితంగా చెప్పాడు భావూ.

అసలు విషయం ఏమంటే, భావూజీ కూడా అలోబా బాధితుడే.
అలోబా పెట్టే ఆరళ్ళను ఆ రోజుల్లో తట్టుకోలేకపోతున్నాడు.
అలోబా ఏం చెబితే అది చేయమన్నారు భావూజీని.
ఇది బాబావారి ఆదేశం. ఆ రోజుల్లో భావూకి చాలా ముఖ్యమైన పనులు అప్పగించారు. భావూ చేయాల్సిన పనుల జాబితా చాలానే వుంది. ఆశ్రమంలోని సైకిళ్ళు, పాయిఖానాలు, శుభ్రం చేయాలి. పరిసరాలలో ఎక్కడా నీళ్ళు నిల్వ వుండకుండా ప్రతిరోజూ శుభ్రం చేయాలి. పరిసరాల పరిశుభ్రతతో పాటు, ఆశ్రమంలోని తోటలోని మొక్కలను చూసుకోవాలి. వీటన్నింటికి తోడు బాబాకు వచ్చే ఉత్తరప్రత్యుత్తరాలు, డైరీ రాయాలి. అలాగే, బాబా ఎక్కడికి వెళ్తున్నా ఆయన ప్రక్కనే వుండాలి. ఇదిఇలావుంటే, భావూకి పనితక్కువైందన్నట్లు
అలోబా కూడా ఏదో ఒక పనిని అప్పగిస్తుండేవాడు.

## మెరుపులాంటి పిడిగుద్దులు

అలా అలోబా పలు పనులు అప్పగించేటప్పుడు కూడా ఆతని మాట ప్రేమగా, మృదువుగా వుండేది కాదు. అలోబా మాట చాలా కఠినంగా, ఆదేశిస్తున్నట్లు, భావూ మనస్సు నొచ్చుకునేలా వుండేది.
ఐతే, భావూకి ఇదొక చక్కని గుణపాఠం నేర్చుకున్నట్లయింది.
సహనం అలవడేలా చేసిందన్నాడు భావూ. అంతా అవతారుని దయ అనుకునేవాడు భావూ. బాబానే తనను ఆ స్థితిలో వుంచాడనుకునేవాడు.
మెహెర్‌బాబాతో గడపటమంటే "పదునైన కత్తి అంచున నడిచినట్లేనన్నాడు" భావూ. అంతేకాదు...ఓ అవిటివాడు తన ఒంటికాలితో, కత్తి అంచున నడవడం ఎంత కష్టమో అవతారుని సాన్నిధ్యంలో కూడా అంతేనంటాడు భావూజీ. అలాంటి జీవనాన్ని కూడా ఎవరూ ఊహించలేరంటాడు ఆయన. బాబా ఆశ్రమ రోజులు గుర్తుచేసుకుంటూ కవితాధోరణిలో భావూ ఇలా అంటాడు.

**"ప్రతిరోజూ మెరుపులాంటి పిడిగుద్దులను భరించాల్సిందే.**
**అలాంటి బాధలేకుండానూ వుండలేకపోయేవాళ్ళం.**
**కఠినమైన ఆదేశాలతో మనస్సు రోదిస్తుంటుంది.**
**మరోవైపు హృదయం ఇంకా ఇలాంటి శిక్ష విధించమని కోరుకుంటుంది.**
**దెబ్బ మీద దెబ్బ అహంకారంపై పడుతుండటంతో హృదయం శక్తివంతమౌతుంది. మనస్సు బలహీనపడుతుంది. అదే అవతారుని ఆశ్రమంలో ఆధ్యాత్మిక జీవన విధానం అని భావూ క్లుప్తంగా పేర్కొన్నాడు.**

***

# 52వ అమరతిథి



అవతార్ మెహెర్‌బాబా భౌతికంగా నేడు మన మధ్యన లేరు. కానీ, ఆయన తన ప్రేమికులతో నిత్య సహచరునిగా వున్నారు. మెహెర్‌బాబాను ప్రేమించేవారికి, ఆయన్ని ఆరాధించే వారందరికీ ఆయన్ని పిలిస్తే ప్రతిక్షణం పలుకుతున్నాడు. మనస్సులో అనుకున్నదే తడవుగా ఆయన వారికి మరింత చేరువగా వుంటున్నాడు. మెహెర్‌బాబా 1969 జనవరి 31న భౌతిక దేహత్యాగం చేశారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లా కేంద్రానికి సుమారు 5 కి.మీ. దూరంలో గల మెహెరాబాద్‌లో, చిన్న కొండపైన మెహెర్‌బాబా సమాధి వుంది. ఈ సమాధిని 1930వ దశకంలోనే మెహెర్‌బాబా స్వీయ పర్యవేక్షణలో చాలా నిరాడంబరంగా నిర్మించారు.

## 2021 జనవరి 31న

మెహెర్‌బాబా 52వ అమరతిథి వార్షికోత్సవాలు 2021 జనవరి 31 జరుగుతున్నాయి. ఐతే, కోవిడ్ 19 వైరస్ కారణంగా మెహెరాబాద్‌లో అమరతిథి వేడుకలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. మెహెరాబాద్‌కి యాత్రీకులను అనుమతించడం లేదు. ఐతే, ఎప్పటిలా అమరతిథిరోజున పలు సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటుచేశారు. ఆ కార్యక్రమాలను కూడా ఆన్‌లైన్‌లోనే వీక్షించే ఏర్పాట్లు చేశారు. మెహెరాబాద్‌లో ప్రతి ఏడాది నిర్వహించే అమరతిథి కార్యక్రమాలకు గత ఐదు దశాబ్దాలుగా వేలాదిమంది ప్రేమికులు హాజరవుతున్నారు. ఈ ఏడాది బాబా ప్రేమికులకు ఆ అవకాశం లేకపోవడంతో చాలామంది నిరాశకు గురయ్యారు. ఐతే, **ప్రియతమ మెహెర్‌బాబా ఎప్పుడూ తన ప్రేమికులతోనే వుంటానన్నారు. పిలిస్తే పలికే దైవం మెహెర్‌బాబా. మీ శ్వాసకన్నా దగ్గరగా తానుంటానని, తన నామస్మరణ మరువవద్దని మెహెర్‌బాబా పలుమార్లు చెప్పారు. ఇది బాబా ప్రేమికులందరికీ అనుభవైక్యమే.**

## మరచిపోవద్దు

అవతార్ మెహెర్‌బాబా 1969 జనవరి 31 మధ్యాహ్నం 12 గంటల సమయంలో

భౌతిక దేహత్యాగం చేశారు. అమరతిథి రోజున మధ్యాహ్నం 12 నుండి 12.15 వరకూ మౌనావతారుడైన మెహెర్‌బాబాను స్మరిస్తూ బాబా ప్రేమికులందరూ మౌనం పాటిస్తారు. అమరతిథి సందర్భంగా ఏర్పాటుచేసిన పలు కార్యక్రమాలలో కూడా ఇదే అత్యంత ప్రధానమైనది. ముఖ్యమైనదీను. తెలుగు రాష్ట్రాలలో వున్న అన్ని బాబా కేంద్రాలలో కోవిడ్ నియంత్రణ నియమాలు పాటిస్తూ అమరతిథి వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు స్థానిక కార్యకర్తలు పెద్దఎత్తున సన్నాహాలు చేశారు. వీలున్న బాబా ప్రేమికులందరూ జనవరి 31న తమ దగ్గరలోని బాబా సెంటర్‌లలో ఏర్పాటు చేసిన అమరతిథి కార్యక్రమాల్లో పాల్గొనడం, ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటలకు మౌనంగా అవతారుని నామస్మరణ చేయడం మరచిపోవద్దు. **ఏదేని పని ఒత్తిడిలో బాబా కేంద్రాలకు వెళ్ళలేనివారు వారెక్కడ వున్నా మధ్యాహ్నం 12 గంటల నుండి 12.15 వరకూ బాబా నామం స్మరిస్తూ అవతారుని దివ్యాశీశ్శులు పొందగలరు. ఇదొక అరుదైన మహత్తర అవకాశంగా భావించవల్సింది.**

మెహెర్‌బాబా 1925 జూలై 10 నుండి మౌనంలో వున్నారు. మౌనంగా వుంటూనే ఆయన అనేక సందేశాలు సమస్త మానవాళి కోసం అందజేశారు. మౌనంలోనే మెహెర్‌బాబా గాడ్ స్పీక్స్– **'భగద్వచనం'**– అనే సృష్టి రహస్యాలను తెలియజేసే గ్రంథాన్ని రాశారు. ఇప్పటికే అనేక దఫాలు పునర్ముద్రితమైన ఈ గ్రంథం, కనీసం ఒకసారైనా చదవమని బాబా తన ప్రేమికులను కోరారు. అన్ని బాబా కేంద్రాలలో భగవద్వచనం ప్రతులు లభ్యమవుతున్నాయి. మెహెర్‌బాబా మానవ రూపంలో వచ్చిన సాక్షాత్తూ ఈ యుగావతారుడు. భగవంతుడు మానవరూపంలో మన మధ్యకు వచ్చినప్పుడు ఏ యుగంలోనైనా దేవుడి దరిచేరి, ఆదరించి, ప్రేమించిన వారి సంఖ్య పరిమితంగానే వుంటుంది. ఈ అవతారకాలం అందుకు మినహాయింపు కాదేమో. **అవతారుని 52వ అమరతిథిని 2021 జనవరి 31 ఎప్పటిలా ఘనంగా జరుపుకుందాం. అవతారుని ఆశీశ్శులు అందుకుందాం!!. స్థానిక బాబా కేంద్రాలలో జరుపుకున్న అవతారుని అమరతిథి వేడుకల సంబురాల విశేషాలను పత్రికలో ప్రచురణార్థం 2021 ఫిబ్రవరి 7లోగా మాకు అందేలాగ పంపగలరు. మా అడ్రస్– ఎడిటర్, మెహెర్‌బాబా పత్రిక, గోదావరి గార్డెన్స్, ప్లాట్ నం. 32, జెజె నగర్ పోస్ట్, యాప్రాల్, సికింద్రాబాద్ – 500 087. మొబైల్ లేదా వాట్సప్ 99595 53218 సంప్రదించగలరు.**

# మెహెర్‌బాబా పత్రిక కోసం

**శ్రీ పి. బలరామయ్య, అనంతపురం, మెహెర్‌బాబా పత్రిక నిర్వహణ ఖర్చుల కోసం రూ 1000/– డిశెంబరు నెలలో విరాళంగా పంపారు. ధన్యవాదములు. జైబాబా.**

# అమరతిధి విశిష్టత

**గతంలో ఓ అమరతిథి రోజున అప్పటి ట్రస్టు చైర్మన్ శ్రీ భావూ కల్చూరి బాబా ప్రేమికులను ఉద్దేశించి తన స్వాగతోపన్యాసంలో అమరతిధి విశిష్టతపై విశేష ప్రసంగం చేశారు. ఆ ప్రసంగ సారాంశం నేటికి మనందరికి మార్గదర్శకంగానే నిలుస్తుంది. దయచేసి పరిశీలించండి.**

***



"ప్రియతమ మెహెర్‌బాబా సశరీరులుగా మనల్ని కలవటం మానేసిన రోజుని అమరతిథి గుర్తుచేస్తుంది. అవతారుడు సర్వేసర్వత్రా వున్న వైనానికి అద్దం పడుతుందీ రోజు. ప్రియతమ బాబా భౌతికంగా మన మధ్యన లేకపోయినా తమ కార్యక్రమాల్ని యాధావిధిగా నిర్వహిస్తున్నారు. ఇది వారి విశ్వకార్యక్రమం. అది ఏమిటో మనకెవ్వరికీ అంతుబట్టదు. ఆ సంగతి అలా వుంచితే, బాబావారు సశరీరులుగా వున్నప్పుడు తమ కార్యక్రమాన్ని రెండు స్థాయిలో చేసేవారు. ఒకటి మనందరి కళ్ళకి కనిపించే భౌతిక ప్రపంచం, రెండవవది మన కళ్ళకి కనబడని ఆంతరంగిక ప్రపంచం ద్వారా. తమ దగ్గరకి వచ్చిన అందరి సంస్కారాలనీ ఆయన తీసుకొనేవారు. తన వద్దకు రాని వారికీ ఈ వరాన్ని ప్రసాదించే వారు. సద్గురువులు ఐదుగురు. వీరి బాధ్యతలు దైవీ ప్రణాళిక ప్రకారం వుంటాయి. అవతారుని పని యావత్తుసృష్టినీ ఆధ్యాత్మికంగా ముందుకు ఒక్క త్రోపు త్రోయటం. ఈ పని సద్గురువులు వల్ల కాదు. వాళ్ళు చేయలేరు. అందుకనే భగవంతుడు మానవ రూపం ధరించి అవతరిస్తున్నది. ప్రపంచాన్ని ఆధ్యాత్మికంగా ముందుకు తీసుకువెళ్ళేది. ముందుకు తీసుకు వెళ్ళటమేమిటి? ఒక్క త్రోపు తోయట మేమిటి? అవతారుడు ప్రాణి కోటి యొక్క చైతన్య స్థాయిని పెంచుతాడు. వాయు దశ నుంచి అన్ని దశల్లోని ప్రాణులకీ అవతారుని వరం లభిస్తుంది. రాయి, లోహం, కూరాకు పురుగు, చేప, పక్షి, జంతువు వంటి వివిధ దశల్లోని ఆత్మకీ, మనుష్యులకీ కూడా అవతారుడు వల్ల చైతన్య స్థాయి పెరుగుతుంది. సద్గురువు కూడా చైతన్య స్థాయిని పెంచగలడు. అయితే ఆయన

మండలి (సర్కిల్)లో వారికి మాత్రమే అలా చేయగలడాయన.

కుక్క, పిల్లి, చిలుక వంటి పెంపుడు జంతువులకి కూడా సద్గురువు చైతన్య స్థాయిని పైకి త్రోయ గలడు. కానీ, అవతారునిలా, ప్రాణులందరకీ, ఆధ్యాత్మిక లబ్ధిని కల్గించలేడు. అందుకనే, అవతారుడు దిగి వస్తున్నాడు.

యావత్తు మానవాళికి ఆధ్యాత్మికోన్నతి కల్గిస్తున్నాడు.

ప్రపంచంలో ఎన్నో మతాలున్నాయి. ఎందరో అవతార పురుషులున్నారు.

ఒక్కో మతానికి వొక్కో అవతారుడు. మతాలు వేరైనా అవతారుడు ఒక్కడే.

జొరాస్టరు, మెహెర్‌బాబా ఒక్కరే. ప్రతి యుగంలో భూమిపై అవతరిస్తున్న పరాత్పరుడు వొక్కడే. పేరు, రూపం, రంగు వేరు అంతే.

అలా ఎందుకు అంటే, ఆయా కాలమాన పరిస్థితులకి తగ్గట్టుగా పై నుంచి దిగి వస్తాడు పరిస్థితులకి తగ్గట్టు ప్రవర్తిస్తాడు. ఐతే, ప్రజలకీ సంగతి అర్థం కాదు. ఒక్కటే అన్న భావన తెలియక మతాల మధ్య అడ్డుగోడలు కట్టుకుని ఒకరిపై ఒకరు కత్తులు దూస్తాము. రక్తపాతం సృష్టిస్తాము. ఈ మతాల మధ్య వైరుధ్యం, పోరాటం– ఇద్దరు సోదరులు కొట్టుకోవటమే. ఒకరి నొకరు చంపుకోవటమే.

మనం మతాల మధ్య బేధ భావం సృష్టించ కూడదు.

ఈ వేళ అమరతిథినాడు ఈ సంగతి మనం బాగా గుర్తుంచుకోవాలి.

యుగ యుగాలుగా అవతరిస్తున్న దేవ దేవుడు ఒక్కడేనన్న నగ్న సత్యాన్ని మనం బాగా జ్ఞాపకం పెట్టుకోవాలి. మనం అదృష్టవంతులం. అందుకే మనకీ ఎరుక కలిగింది. మనం మతం వెనుక కాకుండా, ఈ మతాలు ఘోషించే సత్య సూక్తం వైపు కదిలి వెళ్ళాలి. అవతారుడు శరీరం వదిలిపెట్టినా, సజీవంగానే వుంటారు. తమ విశ్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే వుంటారు. ఒక రోజా, రెండు రోజులా, వందేళ్ళ వరకూ అవతారుడు చురుకుగా పనిచేస్తూనే వుంటారు. ఈ కాలంలో మీరు పిలిచినా, పిలవక పోయినా మీకు సహాయం చెస్తాడు. అయితే వంద ఏళ్ళు అయ్యాక ఆయన విశ్రాంతికి వెళ్ళి పోతాడు. అప్పుడు కేవలం పిలిచితే పలికే దైవం అవతారుడు. నేటికి బాబా సశరీరం వదిలి 52 సంవత్సరాలయింది. విశ్వ వ్యక్తీకరణ మరో 48 సంవత్సరాలు పడుతుంది. ఈ వచ్చే 48 సంవత్సరాలు బాబా ఎప్పటిలానే మన మధ్య భౌతికంగా వున్నట్లుగానే వుంటారు. ఆ దరిమిలా మనస్ఫూర్తిగా పిలిస్తే పలుకుతారు. అవతారుడు సర్వశక్తిమంతుడు. ఆయనకి రేపు లేదు. నిన్న అసలే లేదు. భగవంతునికి వున్నది కేవలం నేడు మాత్రమే.పరాత్పరుడికి అన్ని రోజులు నేటి క్రిందనే లెఖ్ఖ. మరచిపోకండి. అమరతిథి కూడా అంతే. నిన్న, రేపు లేదు. అమరతిథికి కేవలం ఈ వేళ మాత్రమే. నిన్న, రేపు మరచి పోవాలి. అప్పుడే మనకి 'నేడు' ఈనాడుగా మారుతుంది.

***

# అక్షరసత్యం
# బాబాతో ఆఖరి సమావేశం
## (ధాకే ఫాల్కర్ స్వీయ రచన నుండి)

మెహెర్‌బాబా మమ్మల్ని సుమారు 200 మందిని, 1968 డిశెంబరు 25న మెహెరాజాద్‌కు పిలిపించారు. ఆ రోజున మెహెరాజాద్‌లో రెండు ప్రధానమైన కార్యక్రమాలు జరిగాయి. 1. మెహెరామాయి జన్మదినోత్సవం. 2. బాబా సోదరుడి కుమారుడైన దారా ఇరానీ వివాహం - శత్రుఘ్నకుమార్, డెహ్రాడూన్ గారి కుమార్తె అమృత్‌తో ఆనాడు ఎంతో వేడుకగా జరిపారు.
ఈ కార్యక్రమం పూర్తయ్యాక మమ్మల్ని బాబా తన దర్శనం చేసుకోమన్నారు.
నేను దర్శనం క్యూలో నిల్చున్నాను. అలా నేను బాబా ఎదుటకు రాగానే,
బాబా నా చేతిని పట్టుకుని క్యూలో నుండి బైటకు రమ్మనమన్నారు.
తన ప్రక్కన నిలబడమని, తన ముఖాన్ని చూపిస్తూ,
**"నేను ఎలా కనిపిస్తున్నానన్నారు".**
బాబా! నీవు చాలా నీరసంగా కనిపిస్తున్నావ్. నీ ముఖంగా అలసటగా వుంది.
కళ్ళకింద నల్లని చారలు వచ్చాయి. బాగా అలసిపోయినట్లున్నావ్ అన్నాను.
**ధాకే నీకు తెలుసా నేనెవరినో? నేను భగవంతుడను.** అందులో సందేహం ఏమీ లేదు. భగవంతుడు సర్వశక్తిమంతుడు. ఈ బలహీనత, అలసటలు భగవంతునికేమీ వుండవు అని అన్నారు బాబా. ధాకే! ఒక పనిచేయి అన్నారు.
**"నేను భగవంతుడినని అందరికీ చెప్పు"** అన్నారు. ఆ పిదప, నేను తిరిగి క్యూలో నిల్చోవడానికై వెడుతుంటే, నా నడుంపై బాబా తన మోకాలు వుంచి నన్ను ముందుకు ఒక్క తోపు తోశారు. "తాను అలసిపోలేదు, బలహీనంగా లేనని చెప్పడానికై బాబా ఇలా చేశారనిపిస్తోంది నాకిప్పుడు". మాలో చాలామందికి బాబాతో ఆఖరి సమావేశం ఇదే. బాబా భగవంతుడని అందరికీ చెప్పమని ఆయన నన్ను ఆదేశించారు.
పాఠక మహాశయులారా!! నమ్మండి. నా అనుభవంతో సాధికారంగా చెబుతున్నాను.
**బాబా భగవంతుడు. ఆయనపై నమ్మకం వుంచండి. మీరు కూడా ఆయన దివ్యత్వాన్ని తప్పక అనుభవించగల్గుతారు.**
**బాబా సమాధిపై మీ చెవిని ఆనించి ఆలకించండన్నారు బాబా!!**
**అవతారుడు అందరివాడు.**
**దేవదేవుడని మీరే గ్రహిస్తారని ధాకేజి అన్నారు.**

***



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: – భావూ కల్చురీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-3 (1925 నుండి -
తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

డీవెన్‌షేర్ చుట్టు ప్రక్కల అన్నీ కొండలే. ఆ కొండల్లో అనేక గుహలు.
ఏ గుహకి వెళ్ళాలన్నా వోపిక, నేర్పు, రెండూ అవసరం.
కొండల్లో నడవడం అందరి తరం కాదనేది యిందుకనే.
మరి బాబావారికి కొండలు ఎక్కడం కొత్త కాదు కదా.
అందుకని, సరదాగా, వో గుహ వరకూ నడుచుకొంటూ వెడదామని
బయలుదేరారు వో రోజున అంటే, సెప్టెంబరు 18వ తేదీ శుక్రవారం నాడు.
బాబావారి వెంట ఆశ్రమవాసులూ కదిలారు.
నెమ్మదిగా కొండ ఎక్కుతూ వో గుహ చేరారు.
సూర్యుడు ప్రచండ భానుడిగా కనిపిస్తున్నా చలి వణికిస్తోంది.
ఒకేసారి ఎండా, వానా మనకి ఎలా అలవాటో,
ఇంగ్లీషు వాళ్ళకి చలి, ఎండ మామూలే.
సెప్టెంబరు నెల అయినా, డిశెంబరులో మాదిరి చలి వుందన్నా అతిశయోక్తికాదు.
ఈ చలి ప్రస్తావన ఎందుకూ అంటే,
అందుకు మన మెరిడిత్‌స్టార్ గారే కారణం.
కొండల్లో రాళ్ళు రప్పలు తప్పించుకొంటూ వో గుహ చేరాక,
ఫోటోలు తీసుకొంటాము మీతో అన్నారు అందరూ.
ప్రభువు సరేనన్నారు.
వో బుల్లి గొర్రెపిల్ల కనిపించింది ఇంతలో.
గొర్రె పిల్లతో బాబావారి ఫోటో తీసుకొందామనిపించింది వో సాధకుడికి.
మెహెరుడు అతని కోర్కె తీర్చారు.
గొర్రెపిల్లని చేతుల్లోకి తీసుకొని ముద్దాడుతుంటే, ఫోటో తీశారు.
భలేబాగుంది ఈ ఫోటో అన్నారు చాలామంది.
వీళ్ళ ధోరణి నచ్చలేదు స్టార్ గారికి.
అవతారుడితో ఫోటో ఇలా తీసుకొంటారా అంటూ ఛీత్కరించాడు.

మరి ఎలా అనే ప్రశ్న వినిపించలేదు కాని,
మన దొర గారే ఆ ప్రశ్నవేసుకొన్నట్లుంది, జవాబు పలికాడు.
ఇంతకీ ఏమన్నాడంటే, మెహెరుడు అవతారుడు.
ఆయన ఫోటోలు కానీ, ఆయనతో మనం తీసుకొనే ఫోటోలు కానీ ఎలా వుండాలి.
సహజత్వం వుట్టిపడుతూ వుండాలి అన్నారు.
సహజత్వం అంటే, అడిగారొకరు.
స్టార్ దొరగారు రఫీమని చెప్పాడు.
బాబా వారు సహజంగా సాద్ర ధరిస్తారు.
సూటు బూటు కాదు కదా.
అందుకని సాద్రాలో వున్న బాబా ఫోటోలు తీసుకొందాము.
మనకి తీపి గుర్తుగా వుంటాయి అంటూ మెహెరుని కేసి చూశాడు.
ప్రభువు చిరునవ్వు నవ్వారు.
'సరే! అలానే కానీండి', అన్నారు.
మన స్టార్ దొర పొంగి పోయాడు. తీరెను,
నాకోర్కె అని కూనిరాగం తీస్తూ కెమెరా క్లిక్ మనిపించాడు.
మాతో కూడా ఫోటో తీయమన్నారు సాధక మహాశయులు.
అంతకంటేనా అంటూ వో గ్రూపు ఫోటో తీశాడు.
బాబా వారి సాద్ర పల్చటి గుడ్డ కదా!
ప్రభువుకి చలి వేస్తున్నదేమోనన్న సందేహం రాలేదు.
తాను మాత్రం స్వెట్టరు, ఆపైన కోటు వేసుకొని కూడా వొణుకుతున్నాడు.
ఒక్కస్టార్ గారే కాదు, బాబావారి చుట్టూ వున్న సాధకులు అందరూ కూడా
వొణుకుతున్నారు. మనకి వేస్తున్న చలి, బాబా వారికి కూడా వేస్తుందేమో
అనిపించలేదు ఏ వొక్కరికీ కూడా. మరి ప్రభువూ అనలేదు ఆ మాట.
ఈ సాద్రలో ఈ కొండపైన ఇంత ఎత్తులో ఇంత చలివేస్తుంటే అని
ప్రభువు అని వుంటే స్టార్ నోరెత్తి వుండేవాడు కాదు.
అలనాడు రామావతార కాలంలోనూ, కృష్ణావతారమప్పుడూ, ఇలానే జరిగింది.
భక్తుడు అరటి పండు తొక్కలు పెట్టినా ప్రేమగానే ఆరగించాడు తప్ప,
'నాయనా, తప్పుచేస్తున్నావ్ అని హెచ్చరించలేదు.
ప్రేమకి, భక్తికీ దాసుడు ప్రభువు, అంటారు అందుకనే.
ఈవాళ ఇక్కడ డేవెన్‌షేర్ గుహల దగ్గర చరిత్ర పునరావృతమైంది.
స్టార్ కోర్కె మేరకి, బాబావారు సాద్రా ధరించి ఫోటోలు తీయించుకొన్నారు.
ఒకటా, రెండా, చాలా ఫోటోలు తీశారావాళ.

ఈ ఫోటోల ప్రహసనానికి గంట పైనే పట్టింది.
అంతసేపూ బాబావారు చిరునవ్వుతోనే కనిపించారు. సాద్రాలో చలికి వొణికి పోతున్న దాఖలా కనబడలేదు ఎవరికీ. ఈ చలికి అతీతుడు బాబా అనుకొన్నారు అందరూ. అవతారుడికి చలి ఏమి చేస్తుంది. బాబా ఎవరు అనుకొన్నారు సృష్టికర్త. జగత్ విధాత. ఆయన్నీ చలి బాధించడమా? అనుకొన్నారు. సంబర పడ్డారు తమ అదృష్టానికి. వీళ్ళ తీరుచూసి, చరిత్రకారుడు చురకలు వేస్తూ అంటాడు కదా **భక్తి వుంటేనే సరిపోదోయి. భగవంతుడి గురించిన అవగాహన కూడా అవసరమన్నాడు. "అజ్ఞానమనే చీకటి నుండి జ్ఞానమనే జ్యోతిని వెలిగించి మేల్కొల్పుటకై ఇలపై జనియించెనురా మానవుని వలె దైవస్వరూపం శ్రీ మెహెరుబాబా అన్నాడు" మనసువున్న మెహెరు కవి, గాయకుడు, బాబ్జీ ఏనాడో.**
"నీవే నేనని, నేనే నీవని, అందరూ ఒకటని సర్వము తానని,
నిజమగు ప్రేమను చాటిన ప్రభువే శ్రీ మెహెర్‌బాబా, అని కీర్తిస్తూనే
బాబ్జీ గారు మన అందరి మనసులో మాటని విన్నవించాడు.
"మాతా పితా, గురుదైవమీవే, మమ్ము క్షమియించి సరిచేయు దైవమీదే,
ఆదిమధ్యాంతరహితుడ అవతారుడా, ధర్మ సంస్థాపనార్థమై వెలసితివా,
ఓ జాగేలరా" అంటూనే, నీ పాదాబ్జములను విడువని వరమిడు వేడుకతో అని
మనవి చేశాడు. ఏమిటయ్యా, నీ గోల అంటే, ఏమి చెప్పమంటావు ప్రభూ..
యోగము చేయ-యోగినికానూ, సాధన చేయ సాధువును కాను,
సంసారబ్దిలో సతమతమయ్యే సామాన్యునిగా సన్నుతి జేతు,
దయనగవేలో - దీనదయాళూ" అని వాపోయాడు మన బాబ్జీ గారు.
అలనాటి డీవెన్‌షేర్ ఆశ్రమవాసులు, బాబ్జీ గారి లాగ
మెహెరావతారీ- దేహధారీ, నిన్నే శరణని వెడితి కోరీ," అని అన్నారో లేదో
చరిత్ర కారుడు చెప్పలేదు కానీ, మెహెరావతారుడి గురించి బాబ్జీ గారికి వున్న అవగాహన ఆనాటి వాళ్ళకి లేదన్నది, ఇదిగో ఈ ఫోటోల ఉదంతం స్పష్టం చేస్తోంది. మనల్ని తట్టి లేపి, మనమందరం వొక్కటేనని చాటి చెప్పడానికి అవతరించిన మెహెరుడు, మన మధ్యన మన మాదిరిగానే వుంటాడన్న సత్యము ఆనాటి వారికి తెలియదు. పాపం, అదివారి తప్పు అనలేము. మనుష్య రూపధారి అయిన భగవంతుడు, సామాన్యుడిగా వ్యవహరిస్తాడు. అనంతదైవీ శక్తి సంపన్నుడయినా శారీరక సుఖాల జోలికి పోడు సరికదా! ఏకాంతవాసం, ఉపవాస దీక్ష అంటూ శరీరాన్ని కష్టపెడ్తాడు సర్వమూ తానైన వాడి లీల యిదంతా. ధన్వంతరీలకీ, విజ్ఞానులకీ అంతుచిక్కదు ఈ లీల. భవరోగాలు బాపే వైద్యుడు అవతారుడు ... భక్త బృందాలకెల్ల దాసుడు యుగమేదైనా దేవెన్‌షేర్‌లో ఈ సత్యమే కళ్ళకి కనిపించింది.

మైమరపించింది అందర్నీ.
పద్దెనిమిది శుక్రవారానికి తెరపడింది.
మర్నాడు, మాబెల్‌రైయాన్ వచ్చింది.
ఆమె వయస్సు 41 సంవత్సరాలు.
వృత్తి డాన్సర్. దక్షిణ ఆఫ్రికా దేశస్థురాలు.
మార్గరెట్ క్రాస్కీ స్నేహితురాలు.
ఇద్దరూ కలిసి నృత్య పాఠశాల నడుపుతున్నారు.
స్నేహితురాలు చెప్పగా బాబావారిని దర్శించాలని వచ్చింది.
అప్పుడే బాబా వారు సముద్రపు వొడ్డు కేసి వెడుతున్నారు
ఏమిటి విశేషం ఈ వేళ అని.
ఇక్కడ ఎటు చూసిన కొండలే కదా కాసేపు ఆ కొండలు గుట్టలు ఎక్కుతారట
అదిగో, ఆ కనిపిస్తున్న పచ్చిక మైదానంలో సరదాగా పచార్లు చేస్తారట
మనతో క్రికెట్ ఆడవచ్చు.
ఎవరైన పాటలు పాడితే ఆనందించను వచ్చు
బాబావారని చెప్పారొక ఆశ్రమవాసి.
ఐతే నేను మీతో వస్తున్నానంటూ,
మాబెల్ బాబా వారి వెంట కదిలింది.
అదొక దివ్యానుభూతి.
ఆమెకి జన్మ జన్మలకీ మరచిపోను అన్నది.
ఇంతకీ ఏమయిందీ అంటే,
యుగావతారుని సాన్నిధ్యంలో గడిపే అదృష్టం ఆమె సొంతమయిందావేళ.
ప్రభువు క్రికెట్ ఆడుతుంటే, కళ్ళు రెప్పార్చకుండా చూసింది.
డాన్స్ చెస్తావా అని అడిగారు.
ఎవరు అడిగారు ఆమెకి తెలియదు.
డాన్స్ చేస్తావా అన్న మాటే చెవిన పడింది.
వెంటనే మార్గరెట్‌తో కలిసి గజ్జ కట్టింది.
వీరిద్దరి నృత్యం అద్భుతహ అన్నారట ప్రభువు.
పొంగి పోయింది.
ఎవరో పాటలు పాడారు.
తానూ గొంతు కలిపింది.
వీళ్ళ పాటని శ్రద్ధగా విన్నాడు మెహెరుడు
ఆశ్రమానికి వస్తున్నప్పుడు మెహెరుడు ఎవరో అంతగా తెలీదు కానీ

ఇప్పుడు ఇంత దగ్గరగా కూర్చుని ఆ మౌనమూర్తి కేసి చూస్తుంటే,
ఆమె  ఆనందం వర్ణనాతీతం.
అదృష్టం వచ్చి తలుపు తట్టడం ఇదే కామోసు అనుకొంది.
తాను అనంత ప్రేమ మూర్తి సాన్నిధ్యంలో వున్న భావన మాబెల్‌ని
వుక్కిరిబిక్కిరి చేసింది.
ప్రభువు ప్రేమామృతధారల్లో పునీతమయింది.
ఆనాటి సాధకుల అందరి భావన అదే.
"మా జన్మ తరించెను, బాబా, జోహారులివిగో గైకోరా" అని కీర్తించారు.
అవతారుని ప్రేమ యొక్క శక్తి మాటలకి అందదు.
ఊహించడం అసాధ్యం కూడా.
ఒక్క చెడ్డ సంస్కారాన్ని అయినా తుడిచి పెట్టడం ఎవరి తరము కాదు కాని
అవతారుని ప్రేమధారకా శక్తి వుంది.
ప్రేమధార ఎవరిపై పడినా పునీతులవుతారు. తరిస్తారు.
అది ప్రేమధార కాదు ప్రేమతో పెట్టిన తీపి ముద్దు.
మెహెరుని ప్రేమామృత ధారలు పడి పాశ్చాత్య నేల తడిసి ముద్దయింది.
ప్రభువు సమక్షానికి వచ్చిన వారందరూ కన్నీళ్ళతో తమ మనోభావాల్ని విన్నవించారు.
మనస్సు మూగది కానీ కన్నీళ్ళ మంటలు రేపుతున్నాడు గుండెల్లో.
ఎగిసి ఎగిసి పడే మంటల్లో ఆవిరి అవుతున్నాయి కన్నీళ్ళు
ఆ అగ్నిజ్వాల నుంచి వో మధుర గానం పుట్టుకు వస్తున్నది.
మనస్సు పాటలు పాడుతున్నారు పాశ్చాత్య ప్రేమికులు.
దివ్య ప్రియతముడికి వొక్కడికే వినిపిస్తున్నదా గానం.
ఇహ మళ్ళీ మెహెరీశంలోకి అడుగుపెడితే,
బాబావారు రోజూ భక్తుల మధ్య వుంటున్నారు
ఆశ్రమం మేడమీద గదిలో కంటే, ఆరుబయట నక్షత్రాల పందిరి క్రింద కూర్చొంటున్నారు
చుట్టూరా భక్తులు చేరుతున్నారు.
మౌనావతారుని సమక్షంలో మౌనంగా కూర్చోవడం చూస్తుంటే,
బాబా వారొక తూరి అన్నమాటలు  గుర్తుకువచ్చాయి రుస్తుం, ఛాన్జీలకి.
మౌనం మాట్లాడనప్పుడు మాటలు ఎందుకు పనికివస్తాయి అన్నారుట బాబా.
అలా ఎంతసేపు జరిగేదో ఆ మౌన సహవాసం
"వూ! కదలండి. రేపు ప్రొద్దున్నే మళ్ళీ లేవాలి" అని చెప్పేవరకూ
ఎవరూ కదిలేవారు కాదు. ఇదొక దినసరి కృత్యం అయింది.
బాగా రాత్రి వరకూ ప్రభువు సమక్షంలో కూర్చొన్నా,

తెలవారుతూనే అందరూ బిలబిలా బాబా వారి సమక్షానికి వచ్చేవారు.
"దొరుకునా, ఈ మహద్భాగ్యం మళ్ళీ" అనుకొనేవారేమో వారు మరి.
ఇరవై తేదీ ఆదివారం. కిట్టీ, జిల్లా లండన్‌కి వాపసు బయలుదేరారు.
మధ్యాహ్న భోజనం అయ్యాక బండి ఎక్కారు.
ఎనిండ్ మర్నాటి వుదయం రైలు ఎక్కింది.
ఎనిండ్ వెళ్ళిన కాస్సేపటికి యన్‌పోవెన్ వచ్చింది.
డీవెన్‌షేర్‌కి దగ్గరగానే వుంటోందిట స్నేహితులుతో
మెరిడిత్ స్టార్ నడుపుతున్న తూర్పు ఛల్లా కొంబె ఆశ్రమం గురించి విన్నది.
వొక సారి వచ్చి వెళ్ళింది కూడా. ఆమెకి బ్రహ్మజ్ఞానం అంటే చాలా యిష్టం.
ఈ యిష్టం పేరు చెప్పి మెరిడిత్‌ని కలిసింది అప్పట్లో
"సెప్టెంబరు 21న బాబావారి దర్శనం. నీ ప్రశ్నలకి జవాబు యిస్తారు", అని
మెరిడిత్ ఉత్తరం వ్రాశాడు. ఆ లేఖ అందుతూనే బయలు దేరింది.
చెప్పిన టయిమ్‌కి ఛల్లా కోంబ్‌లో అడుగు పెట్టింది.
ఏవూరు మనది అని అడిగారు మెహెరుడు.
"మాది వేల్స్", అన్నారామె.
"వోహో! అలాగా! అయితే నువ్వు వెల్షియన్" అన్నారు ప్రభువు.
బ్రిటన్‌లో తనకంటూ వో ప్రత్యేకతవున్న ప్రాంతం వేల్స్.
సుందర సాగర తీరం, కొండలు, పచ్చికబైళ్ళు ఇక్కడి ఆకర్షణలు.
ఈ ప్రాంతంలో మాట్లాడే భాష వేల్ష్ భాష.
ఇది అదొక రకమైన యాసలో సాగే ఇంగ్లీషు అనవచ్చు.
మనం ఇంగ్లీషు వాళ్ళ దేశంలో చెప్పుకొనే బ్రిటీషు దేశం
వాస్తవానికి ఒక్క దేశం, ఒక్క సంస్కృతి కాదు.
ఇంగ్లాండు, వేల్స్, స్కాట్‌లెండ్ అన్నమూడు ప్రాంతాల సమాహారం.
ఇవి కాకుండా ఉత్తర ఐర్లండ్ అని మరో ప్రాంతం కూడా వుంది.
అక్కడ వేర్పాటు వాదం ఎంతో కాలంగా వినిపిస్తోంది.
స్కాట్‌లెండ్‌లో కూడా వేర్పాటు వాద ధోరణులు కనిపిస్తాయి.
ఆ సంగతి అప్రస్తుతాంశం.
క్రీస్తుకి పూర్వమే, అంటే సుమారు 31 వేల సంవత్సరాల నాటికే వేల్స్‌లో జన సంచారం వుందట అంటే ఇది ఎంత ప్రాచీనప్రాంతమో, ఇక్కడి నాగరికత ఎంత గొప్పదో మనం వూహించుకోవచ్చు. అంతట ఘనకీర్తి వున్న వేల్స్ నుంచి వచ్చిన యన్‌పోవెన్‌కి సెప్టెంబరు 21వ తేదీనాటి దర్శనం వో తీపిగుర్తు.
మంచిపోలేని మధుర ఘడియలవని అంది ముప్పయి ఏళ్ళ తర్వాత అడిగితే.

ఆ(శమంలో అడుగుపెట్టే సరికి దిగాలుగా వున్నాను.
నాలో నిరాశ గూడు కట్టుకొంది.
నరనరాలలో నిస్పృహ చోటు చేసుకొంది.
అడుగు తీసి అడుగు వేయుటకు భారం అనిపిస్తోంది.
పడిపోతానేమోననిపించి వాకిలి తలుపు పట్టుకొన్నాను.
సంస్కారాల భారం మోయలేననిపించింది.
మెహెర్‌బాబా దేవుడని స్టార్ చెప్పాడు.
ఆ మాట విని ఇంతదూరం వచ్చాను కానీ,
అతగాడికి బాబా వారి గురించి ఏమి తెలుసు అనిపించింది.
అతని మాటలు నీటి మూటలేమో అన్న సందేహం పట్టుకొంది.
అయినా దేముడనేవాడు ఇంత మారుమూల కొండల్లో ఎందుకు వుంటాడనిపించింది.
అనుమానం రాకూడదు కానీ,
వస్తే వదిలి పెట్టరు కదా.
నాకూ అంతే అయింది.
ఎందుకు వచ్చానా, యింత దూరం అన్న సందిగ్ధంలో పడ్డాను.
ఏం చేయాలి యిప్పుడు అని దీర్ఘాలోచనలో
అలా వాకిట్లో నిలబడ్డ నేను మెహెరుని కంటిలో పడ్డాను.
నాకేసి చూశారు
"రా, ఇటురా, నా (ప్రక్కన కూర్చో" అంటూ చెయి వూపారు.
చెప్పినట్లే చేశాను.
ఏదో అతీంద్రియ శక్తి నన్ను నడిపించింది.
ఎదురు ప్రశ్న వేయకుండా ప్రభువుకేసి నడిచాను
తను ప్రక్కన కూర్చోబెట్టుకొన్నారు. నాతలపై చేయి వేశారు.
ఒక్కసారి రెక్కలు వచ్చినట్లయింది
శరీరం గాలిలో తేలిపోయింది.
గుండెలపై బరువు పటాపంచలయింది.
ఆక్షణంలో ఏదో అనిర్వచనీయమైన దివ్యానుభూతి నా సొంతమయింది.
బాబావారికేసి అలా చూస్తూ కూర్చొన్నాను.
ఎంతసేపు అలా వున్నానో! ప్రభువు ప్రేమధారలో తడిసి పోయాను.
ఆనందం కన్నీటిగా మారింది.
ప్రభువుకి పాదాభిషేకం చేశాను.
బాబా వారి శిష్యుడను కొంటాను వొకాయన నన్ను వోదార్చబోయాడు

మెహెరుడు అతడిని వారించాడు.
'ఆమె దగ్గరకి వెళ్ళకు. కాసేపు వొంటరిగా వదిలేయి ఆమెని.
సంభాలించుకొంటుంది కాసేపటిలోనే', అన్నారు.
నాకో కితాబు యిచ్చారు కూడా!
ఈ వెల్ష్‌యన్ నన్ను హృదయపూర్వకంగా కొలుస్తోంది.
నిజాయితీగల వ్యక్తి. నేనున్నాగా అండగా ఆమెకి అన్నారు.
బాబా వారి సమక్షంలో ఎంతసేపు కూర్చొన్నానో ఇప్పుడు గుర్తు లేదు.
చాలాసేపే వున్నానేమో! అలానే ఎప్పుడు ప్రభువు శలవు తీసుకొని వెళ్ళానో కూడా
గుర్తులేదు. ఆవేళ కాలం స్థభించినట్లుంది.
చెప్పానే, అదొక మత్తులో పడ్డాను.
ఆ మత్తులోనే, నా బసకి నడుచుకొంటు వెళ్ళాను.
ఆశ్రమానికి నాలుగు మైళ్ళ దూరంలో దక్షిణ డేవెన్‌షీర్‌లో నా బస
అక్కడికి నడుచుకొంటూ వెళ్ళాను.
ఎలా నడిచానో ఏమో! నాకు యిప్పటికీ తెలీదు.
నమ్మండి నమ్మకపోండి. తూలిపోతూ అడుగుపెట్టాను బసలో.
మిత్రులు చుట్టూ గుమిగూడారు.
ఏమయింది యన్! ఏమయింది? అని అడిగారు. ఏమనిపించింది
మెహెర్‌బాబాని చూస్తే! అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.
మౌన మూర్తి దర్శనం చేసుకు వచ్చాను కదా.
వాళ్ళ ప్రశ్నలన్నింటికీ మౌనమే నా సమాధానమయింది.
ఏదో చెప్పాలనిపించింది. కానీ పెదవి కదిలితే కదా!
మాటలకు అందని అనుభూతిని నాది.
మాటల్లో చెప్పాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది కదూ!
అయితే ఒక్కటి మాత్రం ఋూడిగా చెప్తాను.
ఆ సెప్టెంబరు 21వ తేదీ నాడు పొందిన మధురానుభూతి ఈవాళ్టి వరకూ
అలానే చెక్కు చెదరకుండా వుంది పదిలంగా నా గుండెల్లో.
ప్రభువు సమక్షంలో మనస్సు దూదిపింజలా తేలిపోయింది.
ఎక్కడలేని ప్రశాంతత నన్ను ఆవరించింది ఆక్షణం.
ఇప్పటికీ ఆ ప్రశాంత చిత్తం నా సొంతమే. ప్రభువు కృప వుంటే,
ఎప్పటికీని నాకది గొప్ప వరమే, అని తన కథ ముగించింది వేల్ష్‌యన్.

**–సశేషం**

# బాబాలో ఐక్యం


శ్రీ గళ్ళా రామారావు

శ్రీ గళ్ళా రామారావు గారు 2020 నవంబరు 20న హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. అవతారుని సాహిత్యం ఆసాంతం చదివిన శ్రీ రామారావు నిత్యం బాబా నామస్మరణలో గడిపారు. సికింద్రాబాద్‌లోని రైల్వే శాఖలో ఉన్నతాధికారిగా పదవీవిరమణ చేసిన రామారావు బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు.


శ్రీ జి.స్వతంత్రకుమార్,

**శ్రీ జి.స్వతంత్రకుమార్,** హైదరాబాద్ తీవ్ర గుండెపోటుతో 2020 డిశెంబర్ 9న బాబాలో ఐక్యమయ్యారు. స్థానిక బాబా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనే స్వతంత్ర కుమార్, మెహెరాబాద్ అమరతిథి రోజుల్లో స్వచ్ఛంద కార్యకర్తగా ఎనలేని సేవలందించేవాడు. ఎప్పుడూ కలివిడిగా అందరితో నవ్వుతూ తిరిగే స్వతంత్ర కుమార్ బాబా ఆలోచనల్లో కూడా నిరంతరం స్వతంత్రంగా వుండేవాడన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు స్థానిక బాబా ప్రేమికులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.



## శ్రీ సతీష్

శ్రీ సతీష్, విశాఖపట్నం స్వల్ప అస్వస్థతతో 2020 నవంబరు 27న అవతారునిలో ఐక్యమయ్యారని విశాఖ కేంద్ర ప్రేమికులు ఒక ప్రకటనలో తెలిపారు. అవతారుని నామస్మరణలో శ్రీ సతీష్ నిరంతరం గడిపేవారని బాబా ప్రేమికులు తెలియజేశారు.



## శ్రీమతి పసుపులేటి సరస్వతి

శ్రీ పసుపులేటి వాసు గారి భార్య శ్రీమతి సరస్వతి 2020 డిశెంబరు 3న స్వల్ప అస్వస్థతతో అవతారుని నామస్మరణతో బాబాలో ఐక్యమయ్యారని శ్రీ పిడుగు అప్పారావ్ ఒక ప్రకటనలో తెలిపారు.

# మెహెరాబాద్ తెలుగు-గుజరాతీల సహవాస్

## 1958 ఫిబ్రవరి 21 నుండి 26 వరకూ

**(గత సంచిక తరువాయి)**

అప్పుడు సమయం ఉదయం 11.40 నిముషాలయింది.
ఆంధ్రా భజన బృందం చక్కని భజన గీతాలు తెలుగులో ఆలాపించారు.
తనతో వచ్చిన కన్యలతో కలిసి గోదావరిమాయిని సాకోరికి బయల్దేరమన్నారు బాబా.
ఫిబ్రవరి 25న, తన పుట్టినరోజునాడు ఆమెను తిరిగి మెహెరాబాద్‌కు రమ్మనమన్నారు.
ఆమె బయలుదేరి వెడుతుంటే సహవాసీలందరూ గోదావరిమాయికి జై అని బిగ్గరగా జయజయనాదాలు చేశారు. ఆంధ్రా ప్రాంతంలోని కేశవాపురం అనే గ్రామం నుండి కొంతమంది క్రైస్తవులు బాబా దర్శనార్థం వచ్చారు. బాబా వారినందర్నీ వేదికపైకి పిలిచి, తన ఆలింగనం ఇచ్చారు. ఫిబ్రవరి 25న మెహెరాబాద్‌లో జరుపబోయే బాబా బర్త్‌డేనాడు బాబా పాదాలు కడిగే అవకాశం ఇప్పించమని కొంతమంది తెలుగు ప్రేమికులు బాబా అనుమతి కోరారు. ఆ రోజున అనేక కార్యక్రమాలు వున్నాయి కాబట్టి, విచ్చేసిన తెలుగు ప్రేమికులందరికీ అనుమతి ఇవ్వడం సాధ్యం కాదు.
కాబట్టి, మీ బృందం మొత్తం తరఫున 12 మంది మగవారు, మరో 12 మంది మహిళలు ఈ కార్యక్రమానికి ఎంపిక చేసుకోమని తెలుగు సహవాసీలకు బాబా సూచించారు. ఈ పాదపూజ కార్యక్రమం పూర్తయ్యాక మీలో ప్రతి ఒక్కరూ ఒక్కొక్కరుగా వచ్చి నాకు పూలదండ వేయొచ్చు, పాదాభివందనం కూడా చేయొచ్చున్నారు బాబా. ఆ రోజు ఆలింగనం మాత్రం ఇవ్వడం కుదరదన్నారు.
నిన్న రాత్రి నా విశ్వ ఆధ్యాత్మిక కార్యక్రమంలో నిమగ్నమై వున్నాను.
మంచంపై పడుకుని అటు-ఇటు తిరుగుతుంటే నా శరీరంలో ఎక్కడ ముట్టుకున్నా తీవ్రమైన నొప్పితో బాధపడ్డాను. దీనికి కారణం ఏమనుకున్నారంటూ,
అంతక్రితం రోజున మీరందరూ వచ్చి నన్ను ఆలింగనం చేసుకోవడమేనన్నారు బాబా.
తన పుట్టినరోజు గురించి ప్రస్తావిస్తూ "నాకు ప్రతిరోజూ జన్మదినమే".
మీకు ఆ రోజు ప్రత్యేకం కావచ్చేమోగాని, తనకే మాత్రం ప్రాముఖ్యత లేదన్నారు.
ఇంతలో ఒక తెలుగు సహవాసీ లేచి నిలబడి, ఆవేశంగా ఇలా అన్నాడు.
నీ పాదపూజ కోసం 12 మంది మగవారు, 12 మంది స్త్రీలను నీవు చెప్పినట్లు

మాలో మేముగా ఎంపిక చేసుకోలేకపోతున్నాం. ఇలాగైతే, బాబా ప్రేమికులుగా మేము, ఈ సహవాస్‌కి నీ సమక్షంలో హాజరవ్వడం కూడా వృధా అనిపిస్తోందన్నాడు. దాంతో బాబా నవ్వుతూ, ఈ ఎంపిక ప్రక్రియను నీ నాయకత్వంలోనే చేపట్టమని ప్రకటించారు. ఆ పిదప సహవాసీలను లంచ్‌కి వెళ్ళిరమ్మనమన్నారు.

మధ్యాహ్నం 2.45కల్లా బాబా తిరిగి సహవాస్ వేదికపైకి వచ్చారు.

మధ్యాహ్నం 3 గంటలవుతున్నా సహవాసీలలో పురుషులు చాలామంది సమావేశ హాలుకు రాలేదు. వారి బసలో బిగ్గరగా శబ్దం వస్తోంది. భోజనానంతరం గట్టిగా గురకపెట్టి నిద్రపోతున్నారా? అని బాబా చమత్కరించారు. బర్‌జోర్ మెహెతా అనే ప్రేమికుడు జవాబిస్తూ మా బస ఎలా వుందనుకున్నారు. కొదమ సింహాలు పోటీపడి పోట్లాడుకుంటున్నట్లు వుందన్నాడు. బాబా ఆతడ్ని వెళ్ళి వారందరినీ సమావేశపు హాలుకు తీసుకురమ్మనమన్నారు. సహవాసీలలో చాలామందికి తెరలు తెరలుగా దగ్గు వస్తోంది. అలా వచ్చే దగ్గుని సహవాసీలు ఆపుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది గమనించిన బాబా, వచ్చే దగ్గుని ఆపుకునే ప్రయత్నం చేయొద్దు. ఏమి ఫరవాలేదు. హాయిగా దగ్గండి. సుఖంగా, హాయిగా, ప్రశాంతంగా వుండండన్నారు.

ఆ పిదప తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఈ రోజున మీకు పలు రకాల విధేయత గురించి చెప్పాను. నా ప్రేమికులలో కొంతమంది నా ఎడల ప్రదర్శించే విధేయత చాలా ప్రత్యేకంగా వుంటుందన్నారు. సహవాసీలు ఎవరూ వ్యక్తిగత ఇంటర్వ్యూల కోసం తగిన టైం అడగరాదని ముందుగానే ఒక సర్క్యులర్‌లో తెలియజేశాం. ఐతే, నేను ఎవరితోనైనా మాట్లాడ్డానికై నా గదికి పిలిస్తే అది వేరే విషయం. అది నా ఇష్టం అన్నారు. కొంతమంది ప్రేమికులు చాలా దూరం నుండి వచ్చారు. ఇండియా నుండే కాకుండా లాహోర్, కరాచీ తదితర దూరప్రాంతాల నుండి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి వచ్చిన వారున్నారు. వారిలో కొందరు నన్ను చూసి పది పదిహేను సంవత్సరాలు పైబడింది. వారిలో చాలామంది నన్నెంతగానే ప్రేమించేవారున్నారు. అలాంటి వారినెవరినైనా పలకరింపుగా నా గదికి పిలిస్తే అది కేవలం మాటామంతి కబుర్లు కోసమే కాని, వారికి నేను ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చినట్లు కాదని బాబా అన్నారు. అంతేకాదు, కొన్ని సందర్భాలలో నేనెవరికైనా ఒకరిద్దరిని నాతో మాట్లాడ్డానికి అనుమతిస్తే, అది నా ఇష్టం ప్రకారం మాత్రమే జరిగిందన్నారు. అంతమాత్రాన మీలోని చాలామంది నా ఇంటర్వ్యూ కోసం ఒత్తిడి చేయొద్దని బాబా స్పష్టం చేశారు. సహవాస్‌లో ముఖ్యమైన విషయాలు చెప్పడానికే తగిన సమయం చాలడం లేదు. అలాంటప్పుడు పిచ్చాపాటి మాటలకు టైం ఎక్కడుందన్నారు. నేనెవరినైనా నా గదికి పిలిస్తే, కేవలం వారి యోగక్షేమాలు అడగటానికి మాత్రమేనన్నారు బాబా. ఐతే, కొంతమంది ప్రేమికులు ఏమంటున్నారో చెబుతూ బాబా ఇలా అన్నారు.

మేం నూరు శాతం బాబాకు విధేయులుగా వున్నాం. బాబా ఇచ్చిన సర్కులర్ ప్రకారం మేమేమీ ప్రత్యేక ఇంటర్వ్యూ కూడా కోరలేదు. ఐతే బాబానే కొంతమందిని తన గదికి పిలిపించుకుని ఇంటర్వ్యూ ఇస్తున్నారు? బాబా ఇచ్చిన సర్క్యులర్‌ని నూరు శాతం విధేయతతో పాటిస్తున్నప్పటికీ బాబా మాకు ఇంటర్వ్యూ అనుమతించ లేదు. మేం చేసిన నేరం ఏమని వారు అడుగుతున్నారు. అదీ వారికి నా ఎడల గల విధేయత అని బాబా చమత్కరించారు. పూణే, ముంబాయి, గుజరాత్‌ల నుండి వచ్చిన ప్రేమికుల్ని నేను తరచు కలుసుకుంటూనే వున్నాను. వారు కూడా పైన చెప్పినట్లు వ్యక్తిగత ఇంటర్వ్యూ వారికి అనుమతించకపోవడం నేరమా? అని అడిగితే, ఆ మాటలు నన్ను బాధిస్తాయి. ప్రతిఒక్కరూ తమకు కేవలం ఐదు నిముషాలు కేటాయిస్తే చాలని అడుగుతున్నారు. పూణే, ముంబాయి ప్రేమికులు కూడా ఆ మాదిరిగా అడిగితే నాకు బాధకలుగుతుంది. కాబట్టి ఈ విషయంలో ఒక నిర్ణయానికి వద్దాం. మీరే నిర్ణయించండి. మీ కోరికనే ఆఖరి మాటగా నిశ్చయం చేద్దాం!. అదేమంటే ఈ రోజూ, రేపూ సహవాస్ కార్యక్రమాన్ని రద్దు చేసి, ఆ సమయాన్ని మీ వ్యక్తిగత ఇంటర్వ్యూల కోసం కేటాయిద్దామా? అని ప్రశ్నించారు. లేదా వ్యక్తిగత ఇంటర్వ్యూల ఆలోచననే విరమించుకుని ఎప్పటిలా సహవాస్ కార్యక్రమం నిర్వహిద్దామా? మీరే నిర్ణయించండన్నారు బాబా. సహవాస్ సమయంలో నేను నా సందేశాలు ఇస్తూ మీ ఎదుటనే వుంటాను, మధ్యలో భజన గీతాలు ఆలకిద్దాం. నేను మీతోనే వుంటాను. వేదికపై వున్న నన్ను మీరు చూడగల్గుతారన్నారు బాబా. మీరే తగిన నిర్ణయం తీసుకుని, ఏది బాగుంటుందో మీరే చెప్పండి. నేను చెప్పాలనుకున్న ముఖ్యమైన విషయాలు ఎన్నో వున్నాయి. మీరు నన్ను భగవంతుడిగా అంగీకరిస్తున్నట్లయితే, నా దగ్గరకు వ్యక్తిగతంగా వచ్చి మీ కష్టనష్టాలు చెప్పుకోవాల్సిన అవసరం ఏముంది? అని బాబా ప్రశ్నించారు. ఆధ్యాత్మిక మార్గంలో వున్న వారికి నేను ఉదయాన్నే ఉదయించే సూర్యుడిని అన్నారు. సూర్యకాంతి వెలుగు ఇస్తుంది. అలాగే ప్రాణికోటికి జీవనాధారం కూడా. కాగా, ఆధ్యాత్మిక పథంలో మూడు రకాల వ్యక్తులు తారస పడతారు. మొదటి రకం – భగభగలాడే సూర్యకాంతిలో మాడి-మసయిపోవాలని తహతహలాడతారు. రెండవ రకంవారు – భానుడి భగ భగల నుండి కేవలం వెచ్చదనాన్ని మాత్రం కోరుకుంటారు. తీవ్ర వేడిమి నుండి దూరంగా జరుగుతారు. ఇకపోతే, మూడవ రకంవారు – సూర్యని వేడి నుండి దూరంగా నీడలో వుంటూ, ఒకవేళ ఎండలోకి రావల్సి వస్తే, తగిన ఆచ్ఛాదనగా తమ తలపై గొడుగు వుంచుకుంటా రన్నారు. తిరిగి బాబా చాలామంది ప్రేమికులు కోరుకుంటున్న వ్యక్తిగత ప్రత్యేక ఇంటర్వ్యూల ప్రస్తావన చేశారు బాబా. ఈ విషయమై మీ నిర్ణయం ఏమిటో తెలియజేయమన్నారు. సహవాస్‌లో మీ మధ్యన వుండటానికి లేదా నా గదిలోనే

వుండి మీకు వ్యక్తిగత ఇంటర్వ్యూలు ఇవ్వడం ఈ రెంటిలో నా వరకూ పెద్ద తేడా ఏమీ లేదు. ఈ రెండూ ఒక్కటే. ఏది ఏమైనా మీ నిర్ణయం తెలియజేయండన్నారు బాబా. **మరి ఆనాటి సహవాసీలు ఏం నిర్ణయం తీసుకున్నారో కొత్తసంవత్సరంలో విడుదలయ్యే జనవరి 2021 మెహెర్‌బాబా సంచిక దాకా వేచి వుందాం.!!**

**-సశేషం**

# నూతన ట్రస్టు సభ్యురాలు అమృత్



అవతార్ మెహెర్‌బాబా ట్రస్టు నూతన సభ్యురాలిగా శ్రీమతి అమృత్ దారా ఇరాని ఎంపిక చేసినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది శ్రీ జాల్ దస్తూర్, ట్రస్టు సభ్యునిగా పదవీ విరమణ చేయడంతో ఏర్పడిన ఖాళీని అమృత్ భర్తీ చేశారు. ఈమె 1949 నవంబర్‌లో జన్మించింది. ఆమె తండ్రి శ్రీ శత్రుఘ్నకుమార్, తల్లి శ్రీమతి సుభద్ర, డెహ్రాడూన్. వీరు బాబా ప్రేమికులందరికీ సుపరిచితులే!! మెహెరామాయి స్వయంగా ఈమెకు **"అమృత్"**అని పేరు పెట్టింది. పసిప్రాయంలోనే అవతారుడ్ని దర్శించుకుని, ఆపై ఆయన సేవలోనే ఆమె అంకితమైంది. మెహెర్‌బాబాకు దగ్గరి బంధువైన దారాతో ఈమె వివాహం 1968 డిశెంబరు 23న అవతారుడు సమక్షంలో మెహెరాజాద్‌లో జరిగింది. 1973 నుండి బాబా సమాధి సేవ చేసుకుంటూ ఈ దంపతులు మెహెరాబాద్‌లో గడుపుతున్నారు.

# శ్రీమతి బాలామణి బాబాలో ఐక్యం

శ్రీ యస్. గురుచరణ్, హైదరాబాద్ గారి తల్లి శ్రీమతి బాలామణి 2020 డిశెంబరు 15న బాబాలో ఐక్యమైనట్లు శ్రీ పిడుగు అప్పారావ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె ఆత్మకు శాంతిచేకూర్చాలని స్థానిక బాబా ప్రేమికులు అవతారుని నామస్మరణ నిర్వహించినట్లు శ్రీ అప్పారావ్ తెలిపారు.

# మెహెరాబాద్‌లో ...,



2020 డిశెంబరు 10 వరకూ



2020 డిశెంబరు 11 నుండి

2020 జూన్-జూలై మాసాలలో తెలగు ప్రాంతాల్లో మాదిరిగానే, మెహెరాబాద్‌లో వర్షాలు పెద్దఎత్తున కురిసాయి.
దాంతో బాబా సమాధి లోపల గది గోడలపై గీచిన పలు కుడ్య చిత్రాలకు ఫంగస్ సోకిందని సమాచారం. అంతేకాదు బాబా సమాధి లోనికి వెళ్ళగానే ఉత్తరాన వున్న కిటికీలో అందంగా కనిపించే అవతారుని తైలవర్ణ చిత్రానికి కూడా ఫంగస్ సోకింది. ఆ కారణంగా ఉత్తర కిటికీలో వుంచిన తెలవర్ణ చిత్రాన్ని తాత్కాలికంగా తొలగించారు.
ఆ చిత్రాన్ని పరిశుభ్రపరిచి మరో రెండు వారాల్లో యధాస్థానంలో వుంచే ప్రయత్నం చేస్తున్నారని మెహెరాబాద్ ప్రేమికులు తెలిపారు.
కాగా, ఆ స్థానంలో శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి, గుంటూరు తీసిన చిత్రాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేసిననట్లు వారు అన్నారు.
శ్రీ మంత్రవాది తీసిన చిత్రానికి ఓ ప్రత్యేకత వుంది.
చాలా సంవత్సరాల క్రితం మాటామంతిగా శ్రీ మంత్రవాది మా ప్రతినిధితో మాట్లాడుతూ చెప్పిన మాటలను ప్రక్క పేజీలలో సమగ్రంగా, సంక్షిప్త సమాచారంగా అందజేసే ప్రయత్నం చేస్తున్నాం. పాఠకులు దయచేసి పరిశీలించగలరు!!.

***

# మంత్రవాది తీసిన చిత్రం

**శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి, గుంటూరు తీసిన ఈ చిత్రం**



సుమారు 25 సంవత్సరాలు మెహెరాబాద్‌లోని బాబా సమాధిలోని ఉత్తర కిటికీ దగ్గర ఉంది. 1965 మే 1 నుండి 6 వరకూ మెహెర్‌బాబా పూణే నగరంలో తన ప్రేమికులందరికీ దర్శనమిచ్చిన సందర్భంలో ఆయన ఈ ఫోటోని తీశారు. పూణే గురుప్రసాద్‌లో బాబా దర్శన కార్యక్రమంలో ఆఖరి రోజున, బాబా దర్శన కార్యక్రమం దాదాపుగా ముగిసిన సమయంలో చివరాఖరుగా తీసిన చిత్రమిదని శ్రీ మంత్రవాది చెప్పారు. ఇంతకీ ఈ ఫోటో ప్రత్యేకత ఏమిటి? అమరతిథికి ఓ ప్రత్యేక వ్యాసం రాసే సమయంలో బాబా సమాధిలో ఈ ఫోటో రెండున్నర దశాబ్దాలు పైగా ఎలా వుందన్న విషయమై మెహెర్‌బాబా పత్రిక ప్రతినిధికి శ్రీ మంత్రవాది అనేక ఆసక్తికర విషయాలు చెప్పారు. ఇకపై శ్రీ మంత్రవాది గారి మాటల్లోనే ...

## బాబా దేహత్యాగం

1969 జనవరి 31న బాబా దేహం చేశారన్న సంగతి మాకు ఫిబ్రవరి 1న తెలిసింది. మేమందరం గుంటూరు నుండి మెహెరాబాద్‌కు వెళ్ళడానికి ఓ ప్రైవేటు బస్సు మాట్లాడుకున్నాం. శ్రీ ఎన్.వి.రమణయ్య, శ్రీ కనకయ్య, శ్రీ బి. సుబ్బారావు, పెదకాకాని తదితరులు మొత్తం ఓ 40 మందిమి గుంటూరు నుండి బయల్దేరాం. మాతోపాటు ఇప్పుడు మెహెరాబాద్‌లో వుంటున్న శ్రీ మల్లాది రామారావు, ఆయన స్నేహితుడొకరు కూడా వచ్చారు. ఆశ్చర్యం ఏమంటే, శ్రీ మల్లాది రామారావు, నరసరావుపేట నుండి ఆ రోజు, ఫిబ్రవరి 1, ఉదయమే మా గుంటూరు బాబా సెంటర్‌కు వచ్చారు. నరసరావుపేటలో ఏర్పాటు చేసిన ఒక బాబా కార్యక్రమానికి శ్రీ రమణయ్య గారిని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని గుంటూరుకు వచ్చారు. మా ప్రయాణ హడావిడి గమనించి, ఆ ముచ్చట ప్రక్కనపెట్టి మాతోపాటు ఆయన కూడా బస్సు ఎక్కేసారు. ఐతే మెహెరాబాద్ మాతో వస్తూ, రానూపోను బస్ టిక్కెట్, ఇతర ఖర్చుల కోసం చేతికున్న హెచ్‌యంటి గడియారం, బంగారపు వుంగరాన్ని గుంటూరులోనే ఓ షరాబుకి అమ్మేసి బస్సు టిక్కెట్ చెల్లించారని, ఆ పిదప ఎప్పుడో మాకు తెలిసింది.

## గుంటూరు నుండి బస్సు

ఆ మాదిరిగా మా బస్సులో ప్రయాణించిన వారి ఆర్థిక కథనాలు ఒక్కొక్కరివి ఒక్కో రీతిన వున్నాయి. ఎందుకంటే, అనుకోకుండా, ఎలాంటి ముందస్తు ఏర్పాట్లు, ఆలోచనలు లేకుండా అతి తక్కువ సమయంలో ప్రయాణమవ్వాల్సి రావడమే ప్రధాన కారణం. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర ఉద్యమం ఉధృతంగా జరుగుతున్న రోజులవి. అంతా బాబా మీద భారం వేసి బయల్దేరాం. బస్సు బయల్దేరే ముందు, నాతో కొత్తగా ఫ్రేం కట్టించిన బాబా ఫోటోనొకదాన్ని బస్సు పైభాగన పెట్టాను. బాబా ఫోటోని బస్సు పైభాగాన అమర్చుకుని మెహెరాబాద్‌కు బయల్దేరాం. మరోమాట చెప్పొచ్చేదేమంటే, అంతక్రితం రెండు మూడ్రోజుల క్రితమే నేను ఆ ఫోటోని మద్రాసు స్టూడియోలో ఎన్‌లార్జ్ చేయించి, గుంటూరులో ఫ్రేం కట్టించాను. ఆ ఫోటో సుమారు 22 సెం.మీ పొడవు, 32 సెంమీ వెడల్పు, వుంది. అంత పెద్దసైజు ఎన్‌లార్జ్‌డ్ ప్రింట్ కావాలంటే, నేను ఆ రోజుల్లో మద్రాసులో ఫిల్మిం స్టూడియోలో చేయించేవాడిని. మన రాష్ట్రంలో ఆ సౌకర్యం ఆ రోజుల్లో లేదు. అలా బయల్దేరిన మేము, మా బస్సు పర్మిషన్లు వగైరాలు పూర్తిచేసుకుని ఫిబ్రవరి 1న మధ్యాహ్నం 3 గంటల తర్వాత బయల్దేరాం. ఆ మర్నాడు ఫిబ్రవరి 2 రాత్రి 11 గంటలకు మెహెరాబాద్‌కు చేరుకున్నాం. ఆ పిదప బాబాను దర్శించుకున్నాం. ఆ తర్వాత మాతో తీసుకు వచ్చిన కొత్త ఫోటోని బాబా దగ్గర వుంచాలని గుర్తుకు వచ్చింది. హుటాహుటిన మా బస్సు దగ్గరకెళ్ళి ఆ ఫోటోని తీసుకొచ్చి బాబా సమాధి గదిలో ఉత్తరాన వున్న కిటికీ దగ్గర నేలపై పెట్టాను.

ఆ తర్వాత ఆ ఫోటోని ఎవరో కిటికీ పైభాగాన వుంచారు. కొందరు దండలు వేశారు. ఆ సమయంలో మెహెరామాయి ఎంతగా రోదిస్తోందో బాబా ప్రేమికులందరికీ తెలుసు. ఆమెని ఓదార్చేలా మెహెరామాయి ముఖభాగం, ఈ ఫోటోలో బాబా మెడలో వున్న పూలమాలలో ఆ మర్నాడు ఫిబ్రవరి 3 నుండి కనిపించింది. మేం కూడా ఆశ్చర్యపడ్డాం. మెహెరాబాద్‌లోని బాబా సమాధిలో వున్న ఈ ఫోటోలో మాత్రమే ఆమె అలా కనిపిస్తోందనుకున్నాను. కాని ఈ ఫోటో ఎవరెవరి దగ్గరుందో వారందరి ఇళ్ళలో వున్న ఫోటోలో మెహెరుడు ధరించిన పూలమాలలో మెహెరామాయి కనిపించింది. ఈ వార్త మెహెరామాయికి కూడా తెలిసి చాలా సంతోషించింది.

ఆ మాదిరిగా మా ఫోటో 1969 ఫిబ్రవరి 3 నుండి 1993 మార్చి వరకూ, సుమారు రెండున్నర దశాబ్దాలు బాబా సమాధిలో ఉత్తర కిటికిలో వుంది. ఆ తర్వాత నేడు మనం చూస్తున్న తైలవర్ణ చిత్రాన్ని అమర్చి, ఈ ఫోటోని ప్రక్కనేవున్న బాబా గదికి మార్చారు. సాంకేతికంగా అభివృద్ధి చెందని రోజులవి. ఎవరైనా ఆ ఫోటో కావాలని నన్ను అడిగితే, మద్రాసు వెళ్ళి ప్రింట్ వేయించి తీసుకువచ్చేవాడిని. నేడు ఆ పరిస్థితులు లేవని శ్రీ మంత్రవాది తనదైన శైలిలో చెప్పారు.

# ఆ బస్సులో నేనూ వున్నాను



**-మల్లాది రామారావ్, మెహెరాబాద్**

ఆ రోజుల్లో మేం నరసరావుపేటలో వుండేవాళ్ళం. 1969లోనే నా బి.ఎస్సీ డిగ్రీ పూర్తయింది. స్థానికంగా ఓ ప్రైవేట్ కాలేజీలో లెఖ్కల లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. ఆ ఏడాది మా స్నేహితులు కొందరితో కలిసి మెహెర్‌బాబా మొబైల్ యూనిట్ పేరిట ఒక స్వచ్ఛంద సంస్థను ప్రారంభించాం. ప్రతిరోజూ సాయంత్రం సైకిళ్ళపై చుట్టుప్రక్కల వున్న గ్రామాలకు వెళ్ళి మెహెర్‌బాబా దివ్యత్వాన్ని తెలియజేస్తూ ప్రసంగాలు చేసేవాళ్ళం. గ్రామస్తులు శ్రద్ధగా ఆలకించేవారు. ఇదిఇలావుండగా, గుంటూరు సెంటర్ నిర్వాహకులలో ముఖ్యుడైన శ్రీ ఎన్.వి.రమణయ్య గారిని ఒక కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఆహ్వానించాలని 1969 ఫిబ్రవరి 1న గుంటూరుకు వెళ్ళాం. గుంటూరులో రైలు దిగి హోటల్‌లో కాఫీ త్రాగుతూ, ఆ రోజు న్యూస్ పేపర్‌లో మెహెర్‌బాబా భౌతిక దేహ త్యాగం చేశారన్న వార్త చూశాను. ఆశ్చర్యమేసింది. నమ్మలేకపోయాను. రమణయ్య గారికి వెంటనే ఫోన్ చేసి చెప్పాను. నేను గుంటూరు వచ్చానని, ఇక్కడ పేపర్‌లో చదివిన విషయాన్ని ఆయనతో చెప్పాను. నన్ను వారింటికి రమ్మనమని చెప్పి, శ్రీ రమణయ్య బాబా కార్యదర్శి ఆదీ కె ఇరానితో ఫోన్‌లో మాట్లాడి ఈ వార్త నిజమని ఖరారు చేశారు. అనంతరం ఒక ప్రైవేట్ బస్సు ఏర్పాటు చేశారు. మెహెరాబాద్‌కి బస్సులో వచ్చేవారందరూ బస్సు ఎక్కేముందరనే టిక్కెట్ చెల్లించాలని స్థానిక కార్యకర్తలు గట్టిగా హెచ్చరించారు. నాకు ఏం చేయ్యాలో పాలుపోని స్థితి. డోలాయమానంలో వున్నాను. నరసరావుపేట నుండి గుంటూరు వెళ్ళి రావడానికి నాన్న గారి అనుమతితో ఓ 10 రూపాయలు తీసుకుని గుంటూరు వచ్చాను. బాబా దర్శనానికి వెళ్ళాలన్న తపన. ఈ పరిస్థితుల్లోనే ముందుగా బ్రాడిపేటలోని పోస్టాఫీసుకు వెళ్ళి మందుగా మా నాన్న గారికి టెలిగ్రాం పంపాను. బాబా దర్శనార్థం మెహెరాబాద్ వెళ్తున్నాను. మీరూ వెంటనే బయల్దేరమని చెప్పాను. టెలిగ్రాం ఇచ్చాక నా జేబులో కేవలం 7 రూపాయలున్నట్లు బాగా గుర్తు. అలా రోడ్డుపై నడుస్తుంటే ఒక చోట బంగారం, వెండి వస్తువులు కొంటాం అనే షరాబు బోర్డు కనిపించింది. అక్కడ నా చేతికున్న హెచ్‌యంటి వాచి, వేలికున్న బంగారు ఉంగరాన్ని ఇస్తే 150 రూపాయలు ఇచ్చాడు. బస్సు టిక్కెట్ చెల్లించాను. అవతారుని దర్శనం చేసుకుని మూడ్రోజులు బాబా దగ్గరే వున్నాను. మెహెరాబాద్ నుండి తిరిగి వచ్చిన రెండ్రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వంలో ప్రెస్ ఇన్‌ఫర్‌మేషన్ బ్యూరోలో ఉన్నతాధికారిగా ఆర్డర్స్ వచ్చాయి. ఆ ఉద్యోగంలో చేరాను. **అవతారుని లీలలు ఎన్నెన్నో. బాబా యుగావతారుడు.** *

# మెహెర్‌మౌంట్

## తప్పక దర్శించాల్సిన ఆధ్యాత్మిక ఆలవాలం

అవతారునికి అంకితమైన బాబా సెంటర్ – అమెరికాలోని కాలిఫోర్నియాకు సమీపంలో వున్న మెహెర్‌మౌంట్. 1946 ప్రాంతంలో, నగర రణగొణ ధ్వనులకు దూరంగా బాబా కేంద్రానొకదాన్ని ఏర్పాటు చేయమని బాబా సూచించారు. కాగా, అమెరికన్ ప్రేమికులు జీన్ ఆడ్రియల్, ఆగ్నస్ బేరన్ మరి కొంతమంది స్థానిక బాబా ప్రేమికులు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేసి 1946 ఆగస్టు 9న తమ సొంతం చేసుకున్నారు. ఆ పిదప మెహెర్‌మౌంట్ అని పేరు పెట్టారు. లాస్‌ఏంజల్స్ నుండి సుమారు 100 కిమీ దూరంలో 172 ఎకరాల విస్తీర్ణంలో, సముద్రమట్టానికి 2500 ఎత్తులో వున్న ఒక సుందర రమణీయ ప్రాంగణం – మెహెర్‌మౌంట్. స్థానిక బాబా ప్రేమికురాలు శ్రీమతి ఆగ్నెస్ ఈ కేంద్ర కేర్‌టేకర్‌గా అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అమెరికాలోని మెర్టిల్‌బీచ్ ఆధ్యాత్మిక కేంద్రాన్ని బాబా 1952లో ప్రారంభించారు. ఆ పర్యటన సమయంలోనే బాబా పది రోజులపాటు మెహెర్‌మౌంట్‌ను సందర్శించాలని భావించారు. ఐదుగురు



బాబా మండలి సభ్యులు కూడా మెహెర్‌మౌంట్‌కు బాబా రాక సందర్భంగా తగిన ఏర్పాట్లు చూడ్డానికై నాలుగైదు రోజులు ముందరగానే వచ్చారు. ఐతే ఒక్లహోమా సమీపంలో బాబా కారు ప్రమాదానికి గురికావడంతో మెహెర్‌మౌంట్‌కు బాబావారి పర్యటన రద్దయ్యింది. ఆపై బాబా ఇక్కడకు 1956 ఆగస్టు వరకూ రాలేకపోయారు.

## 1956 ఆగస్టు 2న

1956 ఆగస్టు 2న కాలిఫోర్నియాలో తెల్లవారుఝామున 4 గంటల ప్రాంతంలో బయల్దేరి మెహెర్‌మౌంట్‌కు బాబా తన ప్రేమికులందరితో కలిసి విచ్చేశారు. అమెరికాలోని మెర్టిల్‌బీచ్ కేంద్రం తర్వాత మెహెర్‌మౌంట్ అంటే తనకెంతో ఇష్టం అన్నారు బాబా. ఇది చాలా పురాతన స్థలమన్నారు. గత అవతారకాలంలో కూడా తానిక్కడకు వచ్చానని ప్రకటించారు. ఈ పర్యటనలో ప్రవచనములుకాని, ఆధ్యాత్మిక సందేశాలు వంటివి ఏమీ ఇవ్వనన్నారు. చక్కని ప్రకృతి ఒడిలో వున్న ఈ కేంద్ర ప్రాంగణంలో భగవంతుని సన్నిధిలో అందరం సేదతీరదామన్నారు. నేను మీ స్థాయికి దిగి వచ్చాను. మనమందరం హాయిగా ప్రశాంతంగా గడుపుదామన్నారు. హాయిగా నవ్వుకుందాం. అదేసమయంలో తాను ఉన్నతోన్నతుడిని అనే విషయాన్ని మరచిపోవద్దని హెచ్చరించారు. ఇక్కడున్న ఒక పెద్ద చెట్టు నీడన, పరుపులాగా పరిచిన నేలమీదరాలిన ఆకులపై బాబా సేదతీరారు. ఇక్కడ బాబా బస చేసిన భవనం 1985 అక్టోబరు 14న అగ్ని ప్రమాదానికి గురయ్యింది. కాగా, ఆనాడు బాబా పాదస్పర్శతో పునీతమైన ఈ ప్రాంగణంలోని అణువణువూ ఎంతో పూజ్యభావంతో పవిత్రంగా రాబోయే తరాలవారికోసం స్థానిక ప్రేమికులు బద్రపరుస్తున్నారు.

## మీరూ సందర్శించగలరు

బాబా కేంద్రం చుట్టూతా పచ్చని వృక్షాలు, పచ్చికబయళ్ళతో నిండివుంది. మరో ప్రక్కన సుదీర్ఘమైన పసిఫిక్ మహాసముద్ర ఘోష కనిపిస్తుంటుంది. బాబా దర్శనం ఇచ్చిన ప్రాంగణంలో అవతార్స్ పాయింట్ పేరిట ఒక చక్కని యాత్రాకేంద్రాన్ని అభివృద్ధి చేశారు. అనేక దేశాల నుండి బాబా ప్రేమికులు, బాబా భక్తులు కానివారు కూడా నిత్యం అనేక మంది ఇక్కడకు వస్తుంటారని నిర్వాహకులు తెలియజేస్తున్నారు. మాటల్లో వర్ణించలేని, అనిర్వచనీయమైన ఆధ్యాత్మికతకు ఆలవాలమైన మెహెర్‌మౌంట్‌ని తెలుగు బాబా ప్రేమికులు తప్పక సందర్శించి తీరవల్సింది. మెర్టిల్‌బీచ్ కేంద్రానికి వెళ్తున్న ప్రేమికులందరూ, మెహెర్‌మౌంట్‌ని కూడా సందర్శించాలనుకోవడం సంతోషం. మరింత సమాచారం కోసం వెబ్‌సైట్‌లో లేదా లార్డ్‌మెహెర్ గ్రంథంలో లభిస్తోంది. అలాగే మరిన్ని వివరాల కోసం సంప్రదించవల్సింది.

**Meher Mount Corporation, 9902 Sulphur Mountain Road, Ojai, CA 93023-9374, Phone: 805-640-0000, info@mehermount.org. OPEN: Thursday-Sunday, Noon to 5 p.m.**

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మ**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము. మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యత్వం

**2020 నెలలో పంపిన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1. | శ్రీ రాంపల్లి తిరుమలేషు, వెంకట్రావ్‌పేట, మంచిర్యాల జిల్లా | 1000/- |
| 2. | శ్రీ సీతారామయ్య, చిలుకలూరిపేట, గుంటూరు జిల్లా | 1000/- |
| | మొత్తం | 2000/- |

**మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000029152, IFSC CODE: IOBA 0001732.**

**మెహెర్‌బాబా పత్రిక వార్షిక సభ్యత్వం రూ. 100/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు**
శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973, IFSC CODE: IOBA 0001732.**
సభ్యత్వం పోస్టులో మనీ ఆర్డర్, బ్యాంకు చెక్కు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరువారు ఈ క్రింది పోస్టలు అడ్రస్సుకు పంపవల్సింది.

**మా అడ్రస్:**
**ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,**
యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087. **ఫోన్: 99595-53218.**
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad. **Editor: D. Nirmaladevi**

**RNI No. APTEL/2002/7310, Postal Concession: HSE/789/2020-2022 Dt.20-01-2020, Date of Publication 20h of every month, Posted at Patrika Channel on 25 / 26th every month.**